



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 244 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ మంగళవారం 26 మే 2026 పేజీలు : 12 వెల : 2/-




# ప్రపంచ విపణికి ఎంఎస్ఎంఈ ఉత్పత్తులు

- సైనింగ్- గ్రౌండింగ్- ఓపెనింగ్ విధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం
- ప్రతీ రంగంలోనూ ఎంఎస్ఎంఈలకు పెట్టుబడి అవకాశాలు
- 38 ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన
- రూ.200 కోట్లతో ఏపీ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభించిన సీఎం
- జెన్ -జీ కలల సాకారానికి కార్యాచరణ
- ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదిక ప్రారంభించిన సీఎం
- మెటా, అమెజాన్ సహా వివిధ సంస్థలతో సీఎం సమక్షంలో ఒప్పందాలు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటైన ఎంఎస్ఎంఈల ద్వారా తయారైన ఉత్పత్తులు ప్రపంచ విపణికి చేర్చేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిగా ఎంఎస్ఎంఈ రంగం ఉందని... భారీ పరిశ్రమలు దేశానికి ప్రతిష్ఠ తీసుకువస్తే.. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు లక్షల మందికి జీవనోపాధిని కలిగిస్తాయని అన్నారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026కు ముఖ్యమంత్రి హాజరయ్యారు. అంతకుముందు 4.4 ఎకరాల్లో 1.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన అంబేద్కర్ కళావేదికను ముఖ్యమంత్రి ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఒకేసారి 1500 మంది హాజరై కార్యక్రమాలు నిర్వహించుకునేలా కన్వెషన్ సెంటర్ నిర్మించటం సంతోషమన్నారు. అమరావతిలోనూ ఈ తరహా కన్వెన్షన్ సెంటర్లను నిర్మించనున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలో మరో ఐదు కన్వెన్షన్ సెంటర్లు నిర్మించనున్నట్టు సీఎం తెలిపారు. ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ సందర్భంగా రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం ఇస్తున్న వెసులుబాట్లను... చేయూతను ముఖ్యమంత్రి వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే ఉంది. యువత కలలకు, మహిళ ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా ఉన్న ఈ రంగం వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉద్యోగాలు మిగతా .. 2లో..


### ప్రధాని మోదీతో మాజీ ఉపరాష్ట్రపతి

# వెంకయ్యనాయుడు భేటీ



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోదీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ అయ్యారు. ఢిల్లీలోని సేవా తీర్థ్‌లో ఆయనతో సమావేశమయ్యారు. వెంకయ్యనాయుడు 2025 డిసెంబర్ నుంచి అటల్ స్మృతి న్యాస్ సొసైటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఢిల్లీలోని వాజ్‌పేయీ స్మారకమైన 'సదైవ్ అటల్' నిర్మాణం మొదలు ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలను కూడా ఈ సొసైటీనే చూస్తోంది. ఈ నేపథ్యంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ ఆలోచనలు, సిద్ధాంతాలు, విలువలను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు సొసైటీ తరఫున రూపొందించుకోవాల్సిన విధివిధానాలపై ప్రధానితో వెంకయ్యనాయుడు చర్చించారు.

# గొప్పగా ఉంటుంది.. లేదంటే అసలు ఉండదు



### ఇరాన్‌తో ఒప్పందంపై ట్రంప్

**విశ్వం వాయిస్ న్యూస్ :** యుద్ధం ముగింపుపై అమెరికా ఇరాన్-మధ్య శాంతి చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కుదిరే ఏ ఒప్పందమైనా చాలా గొప్పగా ఉంటుందని.. లేదంటే అసలు ఉండదని పేర్కొన్నారు. తాము చర్చల స్థాయిలోనే ఉన్నామని.. ఒప్పందం ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేశారు. తమ నేతలు ఇరాన్ ముందు ఉంచిన ప్రతిపాదనలకు ఆ దేశం అంగీకరిస్తేనే ఈ విషయంలో ముందడుగు వేస్తామన్నారు. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని.. ఈ విషయంపై గల్ఫ్ దేశాల అధినేతలతోనూ సంప్రదింపులు మిగతా .. 2లో..

### బీ అలర్ట్.. రోళ్లు పగిలే

# 'రోహిణి కార్తె' ప్రారంభం

**విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు పంచాంగం ప్రకారం నేటి మే 25 నుంచి అత్యంత శక్తిమంతమైన 'రోహిణి కార్తె' ప్రారంభమైంది. జూన్ 7 వరకు కొనసాగే ఈ కాలంలో ఎండల తీవ్రత గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్య, వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన ఎండల వల్ల ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగి, వడగాలులు, ఉక్కపోత తీవ్రరూపం మిగతా .. 2లో..

### మీ బాధ, ఆక్రోశం

# నేను అర్థం చేసుకోగలను జగన్

**మెగా డీఎస్సీపై జగన్ వ్యాఖ్యలు - జగన్‌ను టార్గెట్ చేసిన మంత్రి లోకేష్**
**16 వేల మంది టీచర్లను జగన్ అవమానిస్తున్నారని విమర్శ**
**ఉద్యోగాలను అడ్డుకుంటూ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆరోపణ**



**విశ్వం వాయిస్ న్యూస్ :** మెగా డీఎస్సీపై వ్యాఖ్యలు చేసిన మాజీ సీఎం జగన్ పై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లను జగన్ అవమానిస్తున్నారని, వారికి లెంపలు వేసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. "మీ బాధ, ఆక్రోశం నేను అర్థం చేసుకోగలను జగన్ రెడ్డి గారు! మీ ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చెయ్యలేదు, జాబ్ క్యాలెండర్ ఊసేలేదు. మేం 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. త్వరలోనే మరో డీఎస్సీ కూడా ఇవ్వబోతున్నాం. మరింత బిగ్గరగా ఏడవడానికి సిద్ధంగా ఉండండి జగన్ గారూ! మీరు టెన్త్ పేపర్లు ఎత్తుకెళ్లిన దొంగ అని, అందరూ అలాగే ఉంటారనుకోవడం చాలా పెద్ద నేరం. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీలో, నిద్రాహారాలు మాని, చదివి ప్రతిభతో ఉద్యోగాలు మిగతా .. 2లో..

### త్వరలో మహిళా శక్తి

# సూపర్ బజార్‌లు

### సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మహిళా వారోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 8 వేల మహిళా సంఘ భవనాలకు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. "మహిళా శక్తి సూపర్ బజార్‌లో మహిళలు పెట్టుబడి పెట్టండి. నాణ్యమైన ఉత్పత్తులకు వాటిని చిరునామాగా మార్చండి. మహిళా సంఘాల ఉత్పత్తుల కోసం గోదాములకు స్థలాలు ఇస్తాం. మహిళల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి మిగతా .. 2లో..

# ఎబోలాపై నడ్డా ఉన్నత స్థాయి సమీక్ష..

### భారత్‌లో కేసుల్లేవని వెల్లడి



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా మిగతా .. 2లో..

### తిరుపతి ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలో

# చిరుత కలకలం



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలోకి చిరుత చొరబడింది. పశువైద్య కళాశాలలోని గర్భకోశ వ్యాధులు, మెడిసిన్ విభాగంలో ఉన్న చిరుతను చూసి ఉద్యోగులు పరుగులు తీశారు. సోమవారం ఉదయం విధులకు హాజరైన ఓ అటెండర్ తాళాలు తీసి శుభ్రం చేస్తుండగా చిరుతను గమనించి పరుగులు మిగతా .. 2లో..

### నా తల్లిదండ్రులకు

# రక్షణ కల్పించండి


### గేయ రచయిత అనంత శ్రీరామ్



**భీమవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గేయ రచయిత అనంత శ్రీరామ్ తన తండ్రితో కలిసి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. యలమంచిలి మండలం దొడ్డిపట్లలో ఉన్న ఉమ్మడి స్థలాన్ని తమ అనుమతి లేకుండానే వేరొకరు రిజిస్ట్రేషన్ చేసుకున్నారంటూ జిల్లా కలెక్టర్ మిగతా .. 2లో..

### రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా

# 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం సాయంత్రం ఈ అవార్డులను ప్రదానం చేశారు. బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర (మరణానంతరం)కు పద్మవిభూషణ్ రాగా.. ఈ పురస్కారాన్ని ఆయన సతీమణి, ఎంపీ హేమమాలిని అందుకున్నారు. కళారంగంలో పద్మవిభూషణ్‌ను ఎన్.రాజమ్ అందుకున్నారు. ఉత్తరాఖండ్ మాజీ సీఎం భగత్‌సింగ్ మిగతా .. 2లో..

### బాలికపై అత్యాచారం వ్యవహారంపై

# జోకులు వేసుకున్న ముగ్గురు ఐపీఎస్‌లు

**నవ్విన ఆ ముగ్గురి జాబులు పీకి పడేసిన తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు రాష్ట్రంలో కోయంబత్తూర్ జిల్లాలో ఓ పదేళ్ల బాలికపై ఘోరం జరిగింది. ఆమెను కొంతమంది వ్యక్తులు అపహరించి.. అత్యంత క్రూరానికి పాల్పడ్డారు. ఈ సంఘటన తమిళనాడు రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ సంఘటనపై మిగతా .. 2లో..

### భూ పరిహారం రాలేదని ఆవేదన..

### పురుగుల మందు డబ్బాతో

# కలెక్టరేట్‌కు..



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ రహదారి నిర్మాణం కోసం భూమి తీసుకొని పరిహారం చెల్లించలేదంటూ ఓ వృద్ధురాలు సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌కు పురుగులమందు డబ్బా తీసుకొని వచ్చారు. ఈమె గతంలోనూ ఇదే విషయమై.. కలెక్టరేట్‌లోని భూసేకరణ విభాగంలో కారం చల్లడం కలకలం సృష్టించిన మిగతా .. 2లో..

### ఇష్టానుసారం మాట్లాడితే

# చేతులు కట్టుకుని కూర్చోవాలా?

### డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నీ పోగొట్టుకునేందుకు సిద్ధంగా ఉండి రాజకీయాల్లోకి వచ్చానని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కొన్ని వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను ఉద్దేశించి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే.. తామూ ఎదురుదాడి చేస్తామని హెచ్చరించారు. తనను మిగతా .. 2లో..

### కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

**గోదావరిలో కలిసే కాలుష్య జలాలపై సమగ్ర ఆడిట్ చేపట్టాలి - నిజాయతీగా కాలుష్య నివారణలో పనులు చేద్దాం**
**ఆంధ్ర పేపర్ మిల్స్ వ్యర్థజలాల నిర్వహణకు వేగంగా ప్రత్యామ్నాయం అవసరం**
**గోదావరి పుష్కర ఘాట్ నుంచి కోటిలింగాల ఘాట్ వరకు పడవలో ప్రయాణించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కల్యాణ్**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'గోదావరి నదిలోకి కలిసే కాలుష్యకారక వ్యర్థాలు, జలాలు, వాటి నిర్వహణపై పూర్తిస్థాయి ఆడిట్ చేపట్టి నివేదిక ఇవ్వాలని, ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి..? భవిష్యత్తులో చేయబోయే పనుల మీద స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు, తూర్పు గోదావరి జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. రాజమహేంద్రవరం మిగతా .. 2లో..



### ప్రకాశం జిల్లా జనసేన కమిటీని

# రద్దు చేసిన పవన్

### 25 మంది సభ్యుల మధ్య 54 గొడవలు ఉన్నాయని వ్యాఖ్య

**విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీలో తన పుష్కర కాలం నాటి సహనానికి స్వస్తి పలుకుతున్నానని, ఇకపై పార్టీలో క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించేది లేదని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. పార్టీని ఒక సైనిక పటాలంలా ముందుకు నడిపించేందుకు కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేశారు. రాజమండ్రిలో మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## ప్రపంచ విపణికి ఎంఎస్ఎంఈ ఉత్పత్తులు

కల్పిస్తోంది. ఏపీలో వనరులకు, అవకాశాలకు కొదవలేదు. వీటిని వినియోగించుకునేలా ఎంఎస్ఎంఈలకు అవకాశాలు కల్పిస్తున్నాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, రైల్వే లాంటి లాజిస్టిక్స్ కూడా ఏపీలో అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ, ఎంట్రప్రెన్యూర్ డెవలప్మెంట్ పాలసీ, ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తెచ్చి ఈ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఎంఎస్ఎంఈ సమ్మిట్ కొత్త ఆవిష్కరణలకు వేదిక కావాలి. కొత్త పరిశ్రమలకు శ్రీకారం చుట్టాలి. పారిశ్రామిక యూనిట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలోనూ 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 100 పార్కులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇవాళ మరో 38 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశాం. త్వరలో ఈ 138 పారిశ్రామిక పార్కులు సిద్ధం అవుతాయి. మిగిలిన వాటిని జూలై నాటికి శంకుస్థాపనలు చేసి అన్ని మౌలిక వసతులూ కల్పిస్తాం. ఈ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు భూములిచ్చిన రైతులకు ధన్యవాదాలు."అని ముఖ్యమంత్రి అన్నారు.

**APCMEPకు రూ. 300 కోట్లు**

"ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలు, నిపుణులు, బ్యాంకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, లబ్దిదారులు ఒకే వేదికపైకి వచ్చారు. వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు కావాలి. రాష్ట్రంలో 20.77 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉన్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.558 కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చాం. పీఎంఈజీపీ, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్, పీఎం విశ్వకర్మ లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేస్తూ ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తున్నాం. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్స్ ఎంట్రప్రెన్యూర్ ప్రోగ్రామ్ కింద రూ.300 కోట్లను కేటాయిస్తున్నాం. రూ.200 కోట్లతో ఏపీ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నాం. ఏపీఐఐసీలో ఎంఎస్ఎంఈ యూనిట్లు స్థాపించే ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాం. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకూ 2953 ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు అయ్యాయి. వీటి ద్వారా రూ.4.68 లక్షల కోట్ల పెట్టుబడులు సమకూరాయి. ప్రైవేటు పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తాం. ప్రైవేటు రంగంలో శ్రీసిటీ ఓ విజయవంతమైన పారిశ్రామిక పార్కు." అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలు లక్ష్యం**

"రాష్ట్రంలో మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. త్వరలో 5 లక్షల మంది డ్వాక్రా మహిళల్ని ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దుతామని ... మహిళా సంఘాల వద్ద ప్రస్తుతం రూ.28 వేల కోట్ల కార్పస్ ఉంది. ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఏపీని ఇన్నోవేషన్ డ్రివెన్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నాం. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది ప్రభుత్వ నినాదం. గ్రామీణ ప్రాంతాలకు టెక్నాలజీ తీసుకువెళ్లాలనే లక్ష్యంతో స్మార్ట్ విలేజ్ సెంటర్లను ప్రారంభిస్తున్నాం. ఓ పరిశ్రమ వ్యర్థాలు మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుంది. సర్క్యులర్ ఎకానమీపై ఎంఎస్ఎంఈలు దృష్టి పెట్టాలి. ఎంఎస్ఎంఈలు ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలన్న లక్ష్యంతో మెటా, అమెజాన్, జోహో లాంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాం."అని ముఖ్యమంత్రి తెలిపారు.

**జెన్ జీ వర్గం యువత కలల్ని సాకారం చేస్తాం**

"మెటా, అమెజాన్ లాంటి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు యువత భవిష్యత్తుకు ఉపాధికి, నైపుణ్యాలకు కొత్త దారుల్ని సృష్టిస్తాయి. మారుతున్న టెక్నాలజీ... ఉద్యోగాల స్వరూపాన్ని మారుస్తోంది. అందుకే టెక్నాలజీ స్కిల్ బిజినెస్ ఇంటిగ్రేషన్ మోడల్ ను అనుసరిస్తున్నాం. పరిశ్రమలకు అనువైన స్కిల్ డెవలప్మెంట్ పై దృష్టి పెట్టాం. ఆధునిక టెక్నాలజీ ఎకోసిస్టమ్ ద్వారా రాష్ట్ర యువతకు గ్లోబల్ స్థాయిలో అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఏఐ, మెటలర్జీ, లాజిస్టిక్స్, క్లీన్ ఎనర్జీ ఏవియేషన్ లాంటి ఫంక్షనల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నాం... పరిశ్రమలకు నైపుణ్యాలు అందించే కేంద్రాలుగా ఇవి మారబోతున్నాయి. జెన్- జీ, జెన్- ఆల్ఫా, టీనేజర్లకు మేలు కలిగేలా... వారి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టెక్నాలజీతో పాటు ఆధ్యాత్మికత కూడా కీలకమైన అంశం. యువశక్తి, టెక్నాలజీ, పరిశ్రమల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లతో ఏపీ అభివృద్ధి చేస్తున్నాం. ప్రతీ రంగంలోనూ ఎంఎస్ఎంఈలు పెట్టుబడులు పెట్టేందుకు ఆస్కారం ఉంది. ప్రధాని మోదీ ఇచ్చిన చిప్ టు షిప్ అన్న నినాదాన్ని నిజం చేసేలా తయారీ రంగంపై దృష్టి పెట్టాం. సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్ అన్నది ప్రభుత్వ విధానం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా సీఎం సమక్షంలో మెటా, అమెజాన్, జోహో సహా వివిధ సంస్థలతో ఏపీ ఎంఎస్ఎంఈడీసీ ఒప్పందం కుదుర్చుకుంది. డీప్ టెక్ స్టార్టప్ కంపెనీలకు రూ.20 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసేందుకు సిడ్బీ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఒప్పందం చేసుకుంది. ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నేతృత్వంలోని స్టార్టప్ కంపెనీలు తయారు చేసిన టెక్నాలజీ ఎనేబుల్డ్ హ్యాండ్ ఇతర ఐటీ, టెక్ ఉత్పత్తులు, డిఫెన్స్ ఉత్పత్తులు, దీనజూ తయారు చేసిన ఎలక్ట్రికల్ ఉత్పత్తులు, ప్రైవేట్ సంస్థలు రూపొందించిన డ్రోన్ బోట్లు, వివిధ రకాల గిరిజన ఉత్పత్తులను సీఎం తిలకించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## గొప్పగా ఉంటుంది.. లేదంటే అసలు ఉండదు

జరుపుతున్నానని తెలిపారు. టెహ్రాన్‌తో తాము కుదుర్చుకోబోయే ఒప్పందంపై ఎటువంటి అవగాహన లేని డెమోక్రాట్లు తమ యంత్రాంగాన్ని విమర్శిస్తుండడం నవ్వు తెప్పిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. తాను సాధించే ప్రతి విజయాన్ని విమర్శించడమే వారి పని అని అసహనం వ్యక్తం చేశారు. అటువంటి వ్యక్తులు దేశంలో విభజనను, ప్రజలకు నష్టాన్ని కలిగించడం తప్ప మరేమీ చేయరని అన్నారు. గతంలో ఒబామా, ఆయన యంత్రాంగంలోని అనుభవం లేని అధికారులు ఇరాన్ అణు ఒప్పందాన్ని ప్రతిపాదించి, అమలులోకి తెచ్చారని విమర్శించారు. వారు చేసుకున్న ఒప్పందానికి.. తాము జరుపుతున్న చర్చలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఇరాన్‌కు 'అణు' శక్తిని అందించే ఒప్పందాలను అంగీకరించబోనని స్పష్టం చేశారు.

## 'రోహిణి కార్తె' ప్రారంభం

దాలుస్తాయి. ఈ కాలంలో శరీరంలోని నీటి శాతం వేగంగా తగ్గిపోయి డీహైడ్రేషన్, వడదెబ్బ, తీవ్ర అలసట వంటి ముప్పులు పొంచి ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ ప్రభావం అత్యధికంగా ఉంటుంది. కాబట్టి ఆ సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం మంచిది. ఒకవేళ వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి. దాహం వేయకపోయినా తరచుగా మంచి నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి పానీయాలు తీసుకోవడం ద్వారా శరీరాన్ని చల్లగా ఉంచుకోవచ్చు. అలాగే పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం ఎక్కువ ఉన్న పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి.

## నా తల్లిదండ్రులకు రక్షణ కల్పించండి

చదలవాడ నాగరాణికి లిఖితపూర్వక వినతిపత్రం అందజేశారు. కోర్టు వివాదంలో ఉన్న ఉమ్మడి స్థలంలో అక్రమంగా చొరబడ్డారని, లారీలతో మెటీరియల్ దించారని పేర్కొన్నారు. వృద్ధులైన తమ తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అనంత శ్రీరామ్ కోరారు. ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా రక్షణ కల్పించాలని తన తండ్రి తరఫున విజ్ఞప్తి చేశారు.

## పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్‌కు..

విషయం విదితమే. నందిగామ మండలం అనాసాగరానికి చెందిన మల్లెంపూడి లక్ష్మీతులసి(65)కి అనాసాగరంలో 8.5 సెంట్ల భూమి ఉంది. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి విస్తరణ, ఇతర అవసరాల నేపథ్యంలో 2003 సంవత్సరంలో 150 చదరపు మీటర్లు , 2010 సంవత్సరంలో 50 చదరపు మీటర్లు, 2021 సంవత్సరంలో 28 చదరపు మీటర్ల చొప్పున భూమి సేకరించారు. '2010, 2021లో తీసుకున్న భూమికి మాత్రమే రూ.8,750, రూ.6,51,821 చొప్పున పరిహారం పడింది. మొదటిసారి తీసుకున్న 150 చదరపు మీటర్లకు సంబంధించి మాకు ఎలాంటి పరిహారం రాలేదు. భూసేకరణ అధికారులు ఇవ్వకుండా మోసం చేశారు. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. పరిహారం ఇప్పించకపోతే పురుగలమందు తాగి చనిపోతాను' అని ఆమె బెదిరించారు. పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న నేపథ్యంలో.. కలెక్టరేట్‌లోని ఓ మహిళా ఏఎస్సై పురుగులమందు డబ్బాను లాక్కున్నారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో వృద్ధురాలు తిరిగి వెళ్లిపోయారు. గతంలో కారం చల్లిన సందర్భంలో ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. మొత్తం పరిహారం మూడు విడతలుగా జమ చేశామని చెప్పారు. నగదు జమ చేసిన తేదీలతో సహా ప్రకటన విడుదల చేశారు. 2003 జూన్ 6న లక్ష్మీతులసి భర్త మల్లెంపూడి వెంకటేశ్వర్లు పేరు మీద రూ.19,413 విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు.

## నేను అర్థం చేసుకోగలను జగన్

సాధించిన 16 వేల మందిని మీరు అనుమానిస్తున్నారు, అవమానిస్తున్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన టీచర్లు అందరికీ జగన్ గారు లెంపలు వేసుకుని క్షమాపణలు చెప్పాలి. మెగా డీఎస్సీ ఆపాలని 200 కేసులు, గూగుల్, టీసీఎస్ రాకుండా కోర్టులో కేసులు వేయించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా, యువతకు ఉద్యోగాలు లేకుండా వారి భవిష్యత్తు నాశనం చేయాలని చూస్తున్న జగన్ గారూ మిమ్మల్ని రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ క్షమించరు" అంటూ లోకేష్ ఘాటుగా స్పందించారు.

## త్వరలో మహిళా శక్తి సూపర్ బజార్‌లు

సాధ్యం. ఉచిత బస్సు ప్రయాణాలకు రూ.10 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించాం. మహిళలను బస్సులకు యజమానులను చేశాం. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. మహిళల దగ్గర నుంచే మిల్లర్లు వడ్లు తీసుకెళ్లేలా ప్రణాళికలు చేస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ చీరల డిజైన్లను సీఎం విడుదల చేశారు.

## ఎబోలాపై నడ్డా ఉన్నత స్థాయి సమీక్ష..

డబ్ల్యూహెచ్‌వో ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం నిఘా పెంచింది. ఈ క్రమంలోనే సీనియర్ అధికారులతో కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దేశంలో ఇప్పటి వరకు ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని ఈ సందర్భంగా ఓ ప్రకటనలో వెల్లడించారు. వైరస్ వ్యాప్తిని నివారించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దేశంలోని ఎయిర్‌పోర్టులు, సీ పోర్టులు, సరిహద్దుల్లో ఎబోలా స్క్రీనింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఎబోలా గుర్తింపు, టెస్టింగ్‌లు, నిఘా కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్‌కూ మంత్రి సూచనలు చేశారు. కేంద్రమంత్రి ఆదేశాల మేరకు ఆరోగ్య శాఖ కార్యదర్శి వివిధ శాఖలు, ఏజెన్సీల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

## చిరుత కలకలం

తీశారు. వెంటనే అధ్యాపకులకు ఈ విషయం తెలపగా.. వారు ఆ గది వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బంది పెద్దగా శబ్దాలు చేయడంతో అది బాత్రూమ్‌లోకి వెళ్లింది. సిబ్బంది బాత్రూమ్ తలుపులు వేసి అటవీశాఖ, జంతు ప్రదర్శన శాల అధికారులకు సమాచారం ఇచ్చారు. వలలు, బోనుతో ప్రత్యేక బృందాలు అక్కడికి చేరుకున్నాయి. మూడు గంటల పాటు శ్రమించి చిరుతను బంధించి అక్కడి నుంచి తరలించారు. పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో గత నాలుగైదేళ్లుగా మూడు చిరుతలు సంచరిస్తున్నట్లుగా అటవీ శాఖ అధికారులు గుర్తించారు. గతంలో ఒక చిరుతను బంధించి తరలించగా.. తాజాగా ఈరోజు మరోదాన్ని పట్టుకున్నారు.

## 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం

కోశ్యారీ, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ కల్లిపట్టి రామసామి పళనిస్వామి, కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకులు ఉదయ్ సురేష్ కుమార్ కోటక్, మహిళా క్రికెట్ జట్టు సారథి హర్మన్ ప్రీత్ కౌర్ తదితరులు ఈ ప్రతిష్ఠాత్మక పౌర పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పురస్కారాలను అందుకున్నవారిలో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం), గూడూరు వెంకట్ రావు , పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి, వెంపటి కుటుంబ శాస్త్రి, దీపికా రెడ్డి ఉన్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో నేడు 66మందికి అందజేయగా.. మిగతా వారికి రెండో విడతలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులను అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, కుమారస్వామి, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

## జోకులు వేసుకున్న ముగ్గురు ఐపీఎస్‌లు

ముఖ్యమంత్రి విజయ్ వెంటనే స్పందించారు. అంతేకాదు జరిగిన ఘటనపై తీవ్రమైన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి సంబంధిత ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కేసులో పోలీసులు వేగంగా వ్యవహరించారు. నేరుగా ముఖ్యమంత్రి నుంచి ఆదేశాలు రావడంతో విచారణను వేగవంతం చేశారు. ఫలితంగా ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ కేసు కు సంబంధించిన విషయాలను చెప్పడానికి నిన్న ఒక మహిళ ఐజీ అధికారి.. ఇద్దరు ఐపీఎస్ అధికారులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. దానికంటే ముందు వారు ముగ్గురు నవ్వుతూ కనిపించారు. ముఖ్యంగా మహిళ ఐజీ అధికారి అయితే తోటి ఐపీఎస్ అధికారులతో సరదాగా నవ్వుతూ ముచ్చటించారు. గోర్లు గిల్లుతూ.. ఈ సంఘటనపై అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆ మహిళ ఐజీ అధికారి వ్యవహరించిన తీర్పట్ల సోషల్ మీడియాలో విపరీతంగా విమర్శలు వచ్చాయి. ఒక బాలిక చనిపోతే కొంచెం కూడా మానవత్వం లేదా అంటూ నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నువ్వు కూడా ఒక మహిళవే కదా.. నీక్కూడా పెళ్లయి ఉంటుంది కదా.. నీకు పిల్లలు ఉండి ఉంటారు కదా.. ఒకవేళ జరిగిన ఘటనలో చనిపోయింది నీ కూతురైతే నువ్వు ఇలానే వ్యవహరిస్తావా అంటూ సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఇది కాస్త ముఖ్యమంత్రి విజయ్ దృష్టికి వెళ్లిపోయాయి. విజయ్ వెంటనే స్పందించారు. ఆ ముగ్గురు ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఒక కేసు వ్యవహారంలో పోలీసులు నిజాలు చెప్పేటప్పుడు ఇలా వ్యవహరించకూడదని సూచించారు. ప్రజలకు పోలీసులు జవాబుదారీగా ఉండాలని.. శాంతి భద్రతలను పరిరక్షించాలని సూచించారు. దారుణంగా వ్యవహరించే అధికారుల మీద ఏమాత్రం జాలి చూపించాల్సిన అవసరం లేదని విజయ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు తన ట్విట్టర్ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. జరిగిన ఘటనపై తాను విచారం వ్యక్తం చేస్తున్నానని.. పోలీసులు ఇకపై ఇలా వ్యవహరించకూడదని ఆయన సూచించారు. అందువల్లే ఆ ముగ్గురు అధికారులపై సస్పెండ్ వేటు వేస్తున్నట్టు వెల్లడించారు. విజయ్ తీసుకున్న నిర్ణయం పట్ల దేశవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి. విజయ్‌ని చూసి మిగతా ముఖ్యమంత్రులు నేర్చుకోవాలని నెటిజన్లు హితవు పలుకుతున్నారు.." విజయ్ ఏమాత్రం నిర్లక్ష్యం వహించలేదు. ఆ ముగ్గురు పోలీసు అధికారులను సస్పెండ్ చేయించాడు. దీనిని బట్టి పోలీసులు ఎలా ఉండాలో.. ఎలా ఉండకూడదో తెలుసుకుంటారని" నెటిజన్లు సోషల్ మీడియాలో వ్యాఖ్యానిస్తున్నారు.

## ప్రభుత్వం కట్టుబడి ఉంది

పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 6 గం.కు పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం పుష్కరాల ఘాట్ నుంచి కోటిలింగాలు ఘాట్ వరకు పడవలో ప్రయాణించి గోదావరి జలాల కాలుష్యకారక ప్రాంతాలను పరిశీలించారు. పుష్కరాల్లో చేయాల్సిన పనుల తీరు, త్వరలో చేపట్టబోయే పనుల ప్రణాళికను స్వయంగా పరిశీలించారు. గోదావరి గట్ల సుందరీకరణ పనులు ఎంతవరకు వచ్చాయనేది, పుష్కరాల నేపథ్యంలో గట్లను ఎలా తీర్చిదిద్దబోతున్నది అధికారులు వివరించారు. ఈ సందర్భంగా చింతలమ్మ ఘాట్ వద్ద నల్లా ఛానల్ ద్వారా రాజమహేంద్రవరం మురుగునీరు గోదావరిలోకి కలిసే ప్రాంతాన్ని పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. నది తీరంలో జరుగుతున్న కాలుష్యం తీరును స్వయంగా చూశారు. నీటిని ఎలా శుద్ధి చేస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న సిబ్బందితో మాట్లాడి వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని చూశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అధికారులకు ఆదేశాలిస్తూ "గోదావరిలోకి రోజువారీ సుమారుగా 55 ఎం.ఎల్.డి. (మిలియన్ లీటర్స్ పర్ డే) మురుగునీరు వస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ మురుగు నీటిని శుద్ధి చేసే విధానం శాస్త్రీయంగా జరగాలి. మురుగు నీటిని నేరుగా గోదావరిలోకి వదలడం వల్ల జలాలు కలుషితం అవుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై దృష్టి సారించాలని సూచించారు.

**నిధులను సత్కార్యం కోసం వినియోగించుకుందాం:**

గోదావరి పుష్కరాలకు ఖర్చు చేసే ప్రతి పైసాను ప్రజలకు ఉపయోగపడే, గోదావరి నది తీరాన్ని కాపాడే మంచి పనులకు ఉపయోగించుకోవాలి. మొదట కాలుష్యకారక అంశాలపై పూర్తిస్థాయి ఆడిట్ జరగాలి.. తర్వాత దానిని ఎలా అధిగమించాలనే అంశాల పట్ల దృష్టి సారించవచ్చు. కేవలం లెక్కలతో సరిపెట్టకుండా పూర్తి స్థాయి యాక్షన్ ప్లాన్ తో ముందుకు వెళ్దాం. కేంద్ర జల శక్తి ద్వారా ఎన్.ఆర్. సి. పి. నిధులు రూ. 416 కోట్లలో రూ. 95 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు వచ్చాయి. ఈ నిధులతో కొత్త ట్రీట్మెంట్ ప్లాంట్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాలి. పూర్తిస్థాయిలో మురుగు లేకుండా జలాలను గోదావరిలోకి విడిచిపెట్టి బాధ్యతను తీసుకోవాల"ని ఆదేశించారు.

**పేపర్ మిల్ కాలుష్యంపై ఆరా:**

ఆంధ్ర పేపర్ మిల్స్ కాలుష్య జలాలు గోదావరిలోకి విడుదల మీద ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య నుంచి వివరాలు అడిగారు. ప్రస్తుతం పేపర్ మిల్లు ద్వారా బయటకు వచ్చే వ్యర్థాలను దూరంగా లంకల్లో విడిచి పెడుతున్నారని, దీనికి ప్రత్యామ్నాయంగా ఆ కంపెనీ మరో ప్రాంతంలో శుద్ధి చేసేందుకు ఆలోచిస్తుందని ఆయన తెలియజేశారు. ప్రత్యామ్నాయ పనులు వేగంగా జరిగేలా చూడాలని, అప్పటివరకు మరో శుద్ధి ప్లాంట్ నిర్మించుకునేలా యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రివర్యులు దిశానిర్దేశం చేశారు.

**ఆసాంతం పరిశీలిస్తూ...**

బోటులో ప్రయాణిస్తున్న దగ్గర నుంచి మున్సిపల్ కార్యాలయానికి చేరుకునే వరకు గోదావరి కాలుష్య నివారణకు తీసుకోబోతున్న చర్యలను పవన్ కళ్యాణ్ అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రత్యక్షంగా ట్రీట్మెంట్ ప్లాంట్ వద్దకు వెళ్లి వేరు చేస్తున్న వ్యర్థాలను సైతం చూశారు. ఆ వ్యర్థాలను ఏం చేస్తారని అడిగి తెలుసుకున్నారు. వ్యర్థ జలాలను శుద్ధి చేయడానికి ప్రస్తుతం ఎలాంటి శాస్త్రీయ పద్ధతి ఉపయోగిస్తున్నారని వివరాలు అడిగారు. నూతన విధానాలు వస్తున్నాయని దానికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలని అధికారులు సూచించారు. అక్కడి నుంచి నేరుగా పుష్కరాల పనుల సమీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయానికి పవన్ కళ్యాణ్ చేరుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, తోపాటు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిషోర్, రాజమండ్రి నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

### ప్రకాశం జిల్లా జనసేన కమిటీని

## రద్దు చేసిన పవన్

జరిగిన పార్లమెంటరీ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీలో ప్రక్షాళనకు శ్రీకారం చుడుతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. దీనికి తొలి అడుగుగా, అంతర్గత కలహాలతో సతమతమవుతున్న ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రకాశం జిల్లా కమిటీలో తీవ్రమైన వర్గ విభేదాలు ఉన్నాయని, కేవలం 25 మంది సభ్యుల మధ్య ఏకంగా 54 గొడవలు ఉన్నాయని పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్గత కలహాలతో ఒకరినొకరు పనిచేయనివ్వకుండా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలో ఇలాంటి క్రమశిక్షణారాహిత్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పార్టీలో అందరికీ స్వేచ్ఛ ఇచ్చానని, కానీ ఇకపై తాను అనుకున్న పద్ధతిలోనే పార్టీని ముందుకు నడిపిస్తానని తేల్చిచెప్పారు. "ఒకే మార్గంలో నడవండి, లేదంటే పక్కకు తప్పుకోండి (ఫాల్ ఇన్ లైన్ ఆర్ ఫాల్ అవుట్ ఆఫ్ లైన్)" అంటూ గట్టిగా హెచ్చరించారు. ఈ నిర్ణయం ద్వారా పార్టీలో ఏ స్థాయి నేతలైనా క్రమశిక్షణ తప్పితే కఠిన చర్యలు తప్పవనే బలమైన సందేశాన్ని పవన్ పంపించారు. త్వరలోనే ప్రకాశం జిల్లాకు కొత్త కార్యవర్గాన్ని నియమించనున్నట్లు సమాచారం.

### ఇష్టానుసారం మాట్లాడితే

## చేతులు కట్టుకుని కూర్చోవాలా?

విమర్శించే వాళ్లు రాగలరా అని ప్రశ్నించారు. "ఎక్కడ ఎలాంటి గొడవలు పెట్టుకుంటారో చెప్పండి.. నేను సిద్ధం. ఛాయిస్ మీకే ఇస్తున్నా.. అంతేగానీ నన్ను రెచ్చగొట్టొద్దు" అని వ్యాఖ్యానించారు. రాజమహేంద్రవరంలో జనసేన నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పవన్ మాట్లాడారు.

**అది పిచ్చి లాజిక్..**

"జగన్‌ను జైలుకు పంపాలని నేను కోరినట్లు ఓ విశ్లేషకుడు చెప్పడంలో ఉన్న లాజిక్ ఏంటో అర్థం కావట్లేదు. జగన్ జైలుకు వెళ్తే నాకు లాభం చేకూరుతుందనడం పిచ్చి లాజిక్. చంద్రబాబు జైలుకు వెళ్లినప్పుడు నేను ప్రయత్నిస్తే సీఎం అయ్యేవాడిని కదా? నా సిద్ధాంతం అది కాదు. శత్రువు బలంగా ఉన్నప్పుడే కొడతా.. బలహీనంగా ఉన్నప్పుడు కొట్టను. విశ్లేషించే వారిని ప్రశ్నిస్తే.. కులం కార్డును పట్టుకొస్తామంటే ఎలా? ఇష్టానుసారం మాట్లాడితే చేతులు కట్టుకుని కూర్చోవాలా.. మాకు కోపం రాదా? కొన్ని వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నామని అనుకుంటున్నాయి. దీటుగా మేం ఎదురుదాడి చేస్తాం.. మీరు వ్యక్తిగతంగా అంటే.. మేమూ అంటాం. ఛాయిస్ ఈజ్ యువర్స్. మితిమీరిన సహనం చేతగానితనం అయిపోతుంది. మౌనంగా ఉన్నానంటే.. మెత్తగా ఉన్నానని కాదు.. గట్టిపడుతున్నానని అర్థం. సరైన సమయం కోసం చూస్తున్నా.. అంతే కానీ బలహీనత కాదు.

**క్రమశిక్షణతో ఉంటేనే కూటమిలో బలం**

పార్టీ నడపాలంటే క్రమశిక్షణ కావాలి. అలా ఉంటే తప్ప కూటమిలో బలం రాదని గుర్తించాలి. జనసేన నేతలు పదవులు ఇస్తే ఉత్సాహంగా పనిచేస్తారనుకుంటే.. మాట్లాడటం మానేశారు. పదవులు ఇవ్వగానే అందరూ పెద్దమనుషులు అయ్యారు. పదవుల కోసమే అయితే జనసేనలో ఉండాల్సిన అవసరం లేదు. అర్ధరాత్రి జనసేన జెండా పట్టుకుని చిన్నారితో ఉన్న మహిళను చూస్తే అది కదా పార్టీ బలం అనిపించింది. పోరాడటం జనసేన మూల లక్షణం. కూటమి కోసం కొన్నిసార్లు సర్దుకుంటాను.. ఇది ఒక పార్టీ గురించి కాదు. ఐదు కోట్ల ప్రజల గురించి కొన్నిసార్లు భరిస్తానని గుర్తించాలి" అని పవన్‌కల్యాణ్ అన్నారు.

# ఎడిటర్ వాయిస్

## ఆ ఎమ్మెల్యేలకు పవన్ చెప్పిన 'రహస్యం'..!

జనసేన పార్టీకి సంబంధించి గత 2024 ఎన్నికల్లో 21 మంది ఎమ్మెల్యేలు విజయం దక్కించుకున్నారు. వీరిలో పలువురి పరిస్థితి.. గ్రాఫ్ బాగానే ఉన్నప్పటికీ.. ఒకరిద్దరు ఎమ్మెల్యేల వ్యవహారం.. మాత్రం వివాదానికి దారితీసింది. వీరిలో రైల్వే కోడూరు ఎమ్మెల్యే.. అరవ శ్రీధర్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఉన్నారు. వాస్తవానికి మరికొందరిపైనా విమర్శలు ఉన్నా.. వారిపై పెద్దగా ఆరోపణలు లేవు. రాజకీయంగా డ్యామేజీ చేసే పరిస్థితి కూడా లేదు.

దీంతో గత కొన్నాళ్లుగా వివాదానికి కేంద్రంగా మారిన అరవ శ్రీధర్, చిర్రి బాలరాజులతో పవన్ భేటీ అయ్యా రు. వారికి తన స్టయిల్‌లో క్లాస్ ఇచ్చారు. ఇదంతా మీడియాలో వచ్చేసింది. అయితే.. వాస్తవానికి ఆ ఇద్దరు ఎమ్మెల్యేలకు క్లాస్ కంటే కూడా.. కీలకమైన రహస్యాన్ని పవన్ చెప్పుకొచ్చారు. ఇది వారికే కాకుండా.. పార్టీ కి.. ఇతర నాయకులకు కూడా వర్తించే వ్యవహారం కావడంతో బయటకు వచ్చేసింది. ఇది పార్టీలో సంచలనంగా మారింది.

ఈ ఇద్దరు ఎమ్మెల్యేలతో చర్చించిన పవన్ కల్యాణ్.. గత ఎన్నికల సమయంలో ఆయా నియోజకవర్గాలకు ఎంత మంది పోటీకిరెడీ అయ్యారో.. జాబితాను తీసి బయటకు చూపించారు. "వాస్తవానికి మనకు ఆ టికెట్లు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇదిగో జాబితా.. టీడీపీ, బీజేపీల నుంచి అనేక మంది నాయకులు ఉన్నా రు. మనకంటే.. మీకంటే కూడా వారంతా ఆర్థికంగా బలంగా ఉన్నారు. కానీ.. మీ కోసం నేను గట్టిగా నిలబడి ఈ టికెట్లు తీసుకున్నా.. మనకు ఎస్సీ, ఎస్టీల్లో ఎంత బలం ఉందో అంచనా లేదు. అయినా.. మనకు టికెట్లు ఇచ్చారు.-- అని వ్యాఖ్యానించారు.

అంతేకాదు.. "ప్రజలు మరీ ముఖ్యంగా వైసీపీకి కంచుకోట అనుకున్న స్థానాల్లో మనం గెలిచాం. ఇప్పుడు వీటిని బద్నాం చేస్తే.. చూస్తూ ఊరుకోను. ఇది మీకంటే నాకు, పార్టీకి కూడా అత్యంత ముఖ్యం. ఒక్కసారి మీరు.. టికెట్లు ఇచ్చే సమయంలో ఉన్న పోటీని గుర్తు చేసుకోవాలి. అప్పుడు ఆలోచించి.. నిర్ణయం తీసుకోండి. ఎవరైనా పోగొట్టు కోవడం తేలిక. ఈ విషయంలో మీరు ఏం చేస్తారో ఆలోచించుకోండి." ఈ వ్యాఖ్యలతో చిర్రి బాలరాజు కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం వారిద్దరు రియలైజ్ అయ్యారు. మొత్తంగా గతాన్ని గుర్తు చేసి.. వారిని రియలైజ్ చేయడం ద్వారా పవన్ కల్యాణ్.. సుతిమెత్తగా సమస్యను పరిష్కరిచడం గమనార్హం.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## అడ్డుగా ఉన్నాడని.. అంతమొందించింది

**ప్రియుడితో కలిసి భర్తను చంపి.. పూడ్చిపెట్టిన భార్య – నారాయణఖేడ్‌లో దారుణం**



**మనూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను భార్య హత్య చేసి, పూడ్చిపెట్టిన దారుణ సంఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండలం ఎల్గోయిలో చోటుచేసుకుంది. నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల కేంద్రమైన మనూరుకు చెందిన కల్పనకు నారాయణఖేడ్ మండలం గంగాపూర్‌కు చెందిన ముత్యంరెడ్డి (35)తో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కల్పన నారాయణఖేడ్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. భర్త బోరు మోటార్ల మెకానిక్. కల్పనకు మనూరు మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన పండరితో పరిచయమై, తర్వాత వివాహేతర సంబంధానికి దారి తీసింది. వీరికి అడ్డుగా ఉన్నాడని ముత్యంరెడ్డిని హత్య చేయాలని ప్రణాళిక వేసుకున్నారు ఇద్దరు. ఈ నెల 17న రాత్రి ముత్యంరెడ్డికి మద్యం తాగించి నారాయణఖేడ్‌లోని ఓ దాబా వద్ద కొట్టి హత్య చేశారు. ఎవరికీ తెలియకుండా జేసీబీ సాయంతో మృతదేహాన్ని సమీపంలో పూడ్చేశారు. తర్వాత భర్త కనిపించడం లేదని కల్పన ఈ నెల 18న నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫోన్‌కాల్స్‌ను ట్రేస్ చేయగా అనుమానం రావడంతో కల్పన, పండరిలను అదుపులోకి తీసుకొని విచారించారు. హత్య చేసినట్లు వారు అంగీకరించారు. మనూరు తహసీల్దార్ విష్ణుసాగర్ సమక్షంలో ఆదివారం మృతదేహాన్ని వెలికితీసి ముత్యంరెడ్డిదిగా గుర్తించారు.

## కారు కొని.. రెక్కీ చేసి.. ఢీకొట్టారు?

**న్యాయవాది హత్య సుపారీ గ్యాంగ్ పనే!**

**ఐదుగురు సభ్యులున్న ముఠా పన్నాగం – పోలీసుల అదుపులో అనుమానితుడు**



**నాంపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర రాజధానిలో సంచలనం రేకెత్తించిన వక్ఫ్ బోర్డు ప్యానల్ న్యాయవాది ఖాజా మొహిజుద్దీన్ హత్య సుపారీ గ్యాంగ్ పనే అని తెలుస్తోంది. ఐదుగురు సభ్యులున్న ముఠా దారుణానికి తెగబడినట్టు, ఇందుకోసం కిషన్ అనే వ్యక్తి కవాడిగూడకు చెందిన వినయ్‌కు రూ.10 లక్షలకు సుపారీ ఇచ్చినట్లు సమాచారం. కొన్నినెలల కిందటే న్యాయవాది హత్యకు నిందితులు పథకరచన చేసినట్లు తెలుస్తోంది. పలుమార్లు రెక్కీ నిర్వహించి విఫలమయ్యారు. ఈ దఫా పక్కా ప్రణాళికతో ముఠా సభ్యులను రంగంలోకి దింపారు. దీనికోసం వినయ్ ఆరు నెలల కిందట సెకండ్‌హ్యాండ్ కారు కొన్నట్లు సమాచారం. మొహిజుద్దీన్ కదలికలను గమనిస్తూ.. గురి తప్పకుండా ఢీకొట్టేలా రెక్కీ చేసినట్టు తెలిసింది. మూడు రోజులుగా శాంతినగర్‌లోని న్యాయవాది నివాసప్రాంతంలో నిందితులు కారు పార్కు చేసి రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. శనివారం ఉదయం 5.45 గంటలకు ఆయన స్విమ్మింగ్‌కు వెళ్లేందుకు కారు వద్దకు వచ్చి.. డోర్ తీస్తుండగా వెనుకవైపు నుంచి వేగంగా ఢీకొట్టారు. నిందితులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ కేసులో వినయ్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. గోవా పారిపోయిన మిగతావారి కోసం పోలీసు బృందాలు అక్కడకు వెళ్లాయి. వక్ఫ్ ఆస్తులను ఆక్రమించి విద్యాసంస్థలు ఏర్పాటు చేసిన వివాదంపై న్యాయవాది న్యాయపోరాటం చేస్తున్నారు. కొన్నేళ్లుగా దీనికి సంబంధించి చోటుచేసుకున్న వివాదాలే హత్యకు ప్రధాన కారణమని పోలీసులు అంచనాకు వచ్చారు. న్యాయవాది కుమారుడు ఫర్హాన్ ఇచ్చిన ఫిర్యాదుతో ముజాహిద్ ఆలంఖాన్, మహబూబ్ ఆలంఖాన్‌లపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బెంగళూరులో ఉన్న వీరిద్దరినీ ఆదివారం హైదరాబాద్ రప్పించి వివరాలు రాబడుతున్నారు. నిందితులకు పోలీసులు రాచమర్యాదలు చేస్తున్నారని హతుడి కుమారుడు ఫర్హాన్, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్‌హుస్సేన్‌లు ఆరోపించారు. అబిడ్స్ పోలీస్‌స్టేషన్ వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. నిందితులు కొద్దినెలలుగా తండ్రితో పాటు తనను కూడా బెదిరిస్తున్నారని ఫర్హాన్ వివరించారు.

## అగ్నిప్రమాదంలో ఎల్‌అండ్‌టీ సంస్థ అతిథిగృహం దగ్ధం

**మేడిగడ్డ బ్యారేజీ సమీపంలో దగ్ధమవుతున్న అతిథిగృహం**

**మహదేవపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ సమీపంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయ అతిథిగృహం దగ్ధమైంది. మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో సంస్థకు చెందిన కార్మికుల దస్త్రాలు, పత్రాలు, కంప్యూటర్లు కాలిపోయాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇందులో ఇంజినీరింగ్ శాఖకు సంబంధించిన దస్త్రాలు, కార్యకలాపాలకు ఎలాంటి సంబంధం లేదని, నష్టం జరగలేదని, నిర్మాణ సంస్థకు చెందిన అతిథిగృహంలోనే ప్రమాదం జరిగిందని కాళేశ్వరం ప్రాజెక్టు రామగుండం సర్కిల్ సీఈ శ్రీనివాస్ తెలిపారు.

## రెండు లారీలు ఢీ.. డ్రైవర్ సజీవదహనం



**పెనుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. అగ్నిమాపక కేంద్రం అధికారి వెంకటేశ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపునకు బంగాళాదుంపల లోడుతో వెళ్తున్న లారీని.. వెనుకనే గోధుమల లోడుతో వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగి గోధుమల లారీలో ఉన్న డ్రైవర్ కిరణ్ (35) సజీవ దహనమయ్యాడు. క్లీనర్ జనార్ధన్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. క్షతగాత్రుడ్ని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం జామి గ్రామానికి చెందిన కిరణ్ (35)గా గుర్తించారు.

## డిజిటల్ అరెస్ట్ పేరిట రూ.24 కోట్ల దోపిడీ

**విశ్రాంత ఉపాధ్యాయురాలి నుంచి కాజేసిన నేరగాళ్లు**

**బెంగళూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** డిజిటల్ అరెస్టులు ఉండవని పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా ఈ తరహా మోసాలకు అడ్డుకట్ట పడటం లేదు. అందులోనూ ఉన్నత విద్యావంతులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు వీటి బారిన పడుతున్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.24 కోట్లు కాజేశారు. శివాజీనగరకు చెందిన లక్ష్మీ రామమూర్తి(70) ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. పిల్లలందరూ విదేశాల్లో స్థిరపడగా ఇక్కడ ఆమె ఒక్కరే నివసిస్తున్నారు. ఇటీవల ఆస్తులు విక్రయించగా వచ్చిన నగదును బ్యాంకు ఖాతాలోనే ఉంచారు. ఈ విషయాన్ని గుర్తించిన కేటుగాళ్లు జనవరిలో ఆమెకు ఫోన్ చేసి నగదు అక్రమ లావాదేవీలకు పాల్పడ్డారని, ఇందుకోసం మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని బెదిరించారు. లక్ష్మీ రామమూర్తి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.24 కోట్లను దశల వారీగా వారి ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. మరింత సొమ్ము ఇస్తేనే విడిచి పెడతామన్నారు. దీంతో ఇంట్లో ఉన్న 1.30 కిలోల బంగారు ఆభరణాలను బ్యాంకులో తాకట్టు పెట్టడానికి వెళ్లారు. ఆ సమయంలో ఆమె భయంగా ఉండటాన్ని బ్యాంకు మేనేజర్ గుర్తించారు. ఏమైందని ప్రశ్నించగా జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. మే నెల రెండో వారంలో బాధితురాలితో సీసీబీ సైబర్ ఠాణాలో ఫిర్యాదు చేయించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముంబయి, దిల్లీకి చెందిన గౌరవ్‌కుమార్, ఓం ప్రకాశ్ రాజ్‌పుత్, వారి ముగ్గురు అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల ఖాతాల్లోని రూ.60 లక్షలు జప్తు చేశారు. మిగిలిన నగదును మరో 22 ఖాతాలకు బదిలీ చేసినట్లు గుర్తించారు. ప్రధాన నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

### లారీ పంపించడం లేదని

## రైతు ఆత్మహత్యాయత్నం

**పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న రైతు సంతోష్‌రెడ్డి**



**సుల్తానాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ గ్రామానికి కేటాయించిన లారీని పోలీసులు వేరే ఊరికి తరలించే ప్రయత్నం చేశారని పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాం పూర్ మండలం పెగడపల్లికి చెందిన మూల సంతోష్‌రెడ్డి అనే యువ రైతు ఆదివారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. సంతోష్‌రెడ్డి నెల క్రితం ఐకేపీ కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చారు. లారీలు రాకపోవడంతో గ్రామానికి చెందిన మరికొంత మంది రైతులతో కలిసి సుల్తానాబాద్‌లోని ఓ మిల్లుకు వచ్చి స్వయంగా లారీ మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో అంబేడ్కర్ కూడలి వద్ద పోలీసులు ఆ లారీ ఆపి వేరే ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేశారు. దీంతో సంతోష్‌రెడ్డి పోలీసులు అడ్డుకున్న లారీ ఎక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న ఎస్సై అశోక్‌రెడ్డి లారీ పంపిస్తామని చెప్పడంతో శాంతించారు.





## పొరపాటున కూడా ఈ వస్తువులను పూజ గదిలో ఉంచొద్దు..

### లేదంటే లక్ష్మీదేవి వెళ్లిపోతుంది!

వాస్తుశాస్త్రం పూజా మందిరంలో ఉంచకూడని వస్తువుల గురించి స్పష్టంగా వివరించింది. పూజా మందిరంలో కొన్ని వస్తువులను ఉంచడం వల్ల ప్రయోజనాలు లేకపోగా.. వ్యతిరేక ప్రభావం ఉంటుందని వాస్తు శాస్త్రం చెబుతోంది. అలాంటి వస్తువులు పూజా మందిరంలో ఉంటే లక్ష్మీదేవి కూడా ఇంట్లో నుంచి బయటికి పోతుందని హెచ్చరిస్తోంది. కాబట్టి ఇంట్లోని పూజా మందిరంలో ఉంచని ఆ వస్తువుల గురించి తెలుసుకుందాం. హిందూ మతంలో వాస్తు శాస్త్రానికి చాలా ప్రాముఖ్యత ఉంది. వాస్తు శాస్త్రం ఇంటి నిర్మాణం, వస్తువుల అమరికను గురించి చాలా వివరంగా తెలియజేసింది. అంతేగాక, ఇంట్లోని పూజా మందిరంకు సంబంధించిన విషయాలను స్పష్టం చేసింది. వాస్తు నియమాలను విస్మరించడం వల్ల జీవితంలో అనేక సమస్యలు వస్తాయని నమ్ముతారు. పూజా మందిరంలో కొన్ని వస్తువులను ఉంచడం వల్ల ప్రయోజనాలు లేకపోగా.. వ్యతిరేక ప్రభావం ఉంటుందని వాస్తు శాస్త్రం చెబుతోంది. అలాంటి వస్తువులు పూజా మందిరంలో ఉంటే లక్ష్మీదేవి కూడా ఇంట్లో నుంచి బయటికి పోతుందని హెచ్చరిస్తోంది. కాబట్టి ఇంట్లోని పూజా మందిరంలో ఉంచని ఆ వస్తువుల గురించి తెలుసుకుందాం.

విరిగిన విగ్రహాలను ఉంచుకోవద్దు

విరిగిన దేవతల విగ్రహాలను పూజా మందిరంలో ఎప్పుడూ ఉంచవద్దు. వాస్తు శాస్త్రం ప్రకారం, ఇంటి పూజా గదిలో



విరిగిన విగ్రహాలను పూజించడం వల్ల ప్రతికూలత పెరుగుతుంది, జీవితంలో అనేక సమస్యలకు దారితీస్తుంది. ఇంకా, పూజ ఎటువంటి ఫలితాలను ఇవ్వదు. విరిగిన విగ్రహాలను పవిత్ర నదిలో నిమజ్జనం చేయాలని సూచిస్తుంది.

పూర్వీకుల చిత్రాలను ఉంచవద్దు

పూజా మందిరంలో పూర్వీకుల చిత్రాలను ఉంచకూడదని వాస్తు శాస్త్రం సలహా ఇస్తుంది. పూర్వీకులు, దేవతల స్థానాన్ని గ్రంథలు వేరుగా నిర్వచించాయి. దేవాలయాలలో పూర్వీకుల చిత్రాలను ఉంచడం వల్ల అశాంతి ఏర్పడుతుందని నమ్ముతారు. వాస్తు ప్రకారం, ఇంట్లో పూర్వీకుల చిత్రాలను ఉంచడానికి దక్షిణ దిశ అత్యంత పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది.

చిరిగిన మత పుస్తకాలను ఉంచుకోవద్దు.

చిరిగిన మతపరమైన పుస్తకాలను పూజా గదిలో ఉంచవద్దు. చిరిగిన మతపరమైన పుస్తకాలను పూజా మందిరంలో ఉంచడం వల్ల వ్యక్తి జీవితంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నమ్ముతారు.

పదునైన వస్తువులను ఉంచవద్దు


వాస్తు శాస్త్రం ప్రకారం.. కత్తెర, కత్తులు వంటి పదునైన వస్తువులను కూడా పూజా మందరింలో ఉంచకూడదు. పదునైన వస్తువులు ప్రతికూలతను సూచిస్తాయని చెబుతారు, కాబట్టి వాస్తు శాస్త్రంలో వివరించిన నియమాలను పాటించాలని సూచించబడింది.

ఎండిన పువ్వులను ఉంచవద్దు

పూజ సమయంలో ప్రతిరోజూ దేవతకు పూలు అర్పిస్తారు. మరుసటి రోజు ఉదయం, దేవత అలంకరణ సమయంలో ఈ పూలను తొలగిస్తారు, ఎందుకంటే ఎండిన పూలను పూజా మందిరంలో ఉంచరు. ఎండిన పూలను పూజా మందిరంలో ఉంచడం వల్ల ఇంట్లోకి ప్రతికూల శక్తి ఆకర్షిస్తుందని నమ్ముతారు. అలాంటి సందర్భంలో, ఎండిన పూలను పవిత్ర నదిలో ముంచాలి లేదా చెట్టు కింద పాతిపెట్టాలి.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 26 మే, 2026

www.viswamvoice.com




# పార్టీ కమిటీల నియామకం ఆగస్టు 14 నాటికి పూర్తి

**పూర్తి పారదర్శకంగా కమిటీల నియామక ప్రక్రియ - పార్టీ బలోపేతం చేసుకొని స్థానిక ఎన్నికల్లో బలం చాటుదాము**
**పార్టీకి సంబంధించి కఠినమైన నియమావళి ఉంటుంది.. అందరూ పాటించాలి - నేను క్రమశిక్షణతో కూడిన కార్యకర్తలను కోరుకుంటున్నాను**
**నియమావళి దాటి ప్రవర్తిస్తే చర్యలు తప్పవు - చిన్న గ్రామానికి రోడ్డు వేయిస్తే ఆస్కార్ గెలిచినంత ఆనందం**
**రాజమండ్రి పార్లమెంటరీ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్**







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 'ఆగస్టు 14వ తేదీనాటికల్లా పార్టీ కమిటీల నియామక ప్రక్రియ పూర్తి చేసే దిశగా సన్నాహాలు మొదలు పెట్టాము. పూర్తి పారదర్శకంగా కమిటీలు నియామకం ఉంటుంది. పార్లమెంటువారీగా కమిటీలు పంపిస్తాను' అని జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఆగస్టు 15వ తేదీన మనం నియమించిన కొత్త కమిటీలు ప్రతి నియోజకవర్గంలో జాతీయ జెండాను ఘనంగా ఎగురవేసి, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు చేసుకోవాలన్నది తన ఆకాంక్ష అని చెప్పారు. ప్రతి పార్లమెంటు కమిటీలో అవగాహన ఉన్న నాయకుల్ని, నా మాట వినే కొంతమందిని పంపుతాననీ. వారితో పాటు కనీసం పార్టీ ప్రారంభించినప్పటి నుంచి వెన్నంటే ఉన్న సాధక్, నిలకడగా సభ్యత్వాలు చేసిన మరో ముగ్గురిని, పార్టీకి పని చేసి స్థానిక రాజకీయాలపై అవగాహన ఉన్న మరి కొందరు ఉంటారని చెప్పారు. సోమవారం రాత్రి జనసేన పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, "వీరు పార్లమెంటరీ కమిటీ కాదు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎంత మంది సాధక్ లు ఉన్నారు. ఎంత మంది నాయకులు ఉన్నారు. వారు ఏం పని చేశారు. ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. పార్టీలో మీరు చేసిన పని తాలూకు వివరాలు ఈ కమిటీకి ఇవ్వండి. కమిటీకి సహకరించేందుకు 20 మంది సాధక్స్ ని పెడతాను. ఎవరు పని చేశారో తెలుసుకోవడానికి నాయకుల్ని పంపడం లేదు. పని చేసిన 20 మంది సాధక్ లను పంపుతున్నాను. ఆ కమిటీ కేంద్ర కార్యాలయానికి ఆ వివరాలు అందిస్తుంది. వాటిని పారదర్శకంగా పరిశీలన చేసి అందరి ఆమోదయోగ్యంతో ఇంఛార్జ్, కోశాధికారిగా ఇలా పార్టీ నిర్మాణం చేపడతాం.

**వ్యూహం నాది... ఆచరణ మీది**

వ్యూహం నేను వేస్తాను. మీరు పాటించండి. ఇప్పటి వరకు పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు వెళ్లడానికే ప్రయత్నం చేశాను. ఏదీ చేయనీయడం లేదు. నాదెండ్ల మనోహర్ ని పెడితే కొంత మందికి నచ్చదు. నేను పెడుతున్నా మీరు పాటించాల్సిందే. హరిప్రసాద్ కి బాధ్యతలు అప్పగిస్తే మాటలు వేస్తారు. ఆయన సీనియర్ జర్నలిస్టు... ఆయన సేవలు అవసరం. కొంత మందికి ప్రధాని మోదీ నచ్చరు. అందరూ మనకి నచ్చే వారు ఉండరు. పార్లమెంటరీ సెలక్షన్ కమిటీలు 25 ఉంటాయి. పంచాయతీ స్థాయి నుంచి సాధక్స్ అంతా నాకు తెలియాలి. ఆగస్ట్ 14వ తేదీకి ఆంధ్రప్రదేశ్ కి సంబంధించి మొత్తం అన్ని కమిటీలు పూర్తి చేస్తాం. జెండా పండగ ప్రతి ఊరిలో మన కార్యవర్గంతో చేసుకుందాం.

**నన్ను అర్థం చేసుకున్న వారు నాతో విభేదించరు**

పార్టీకి సంబంధించి ఎవరు ఏది మాట్లాడాలన్నా చెప్పేందుకు ఒక వ్యవస్థ ఏర్పాటు చేస్తాను. దానికి లోబడే మాట్లాడాలి. సోషల్ మీడియా ఉంది కదా అని ఎవరి ఇష్టానికి వారు ప్రచారం చేయకూడదు. పార్టీ ఎవరి వల్ల పెరుగుతుందో ఆలోచించండి. ఓట్ల కోసం ప్రజల్ని ఎవర్ని ఒప్పించగలరో తెలుసుకోండి. నన్ను అర్థం చేసుకున్న వారు నన్ను విబేధించరు. పార్టీకి సంబంధించి కఠినమైన నియమావళి ఉంటుంది. దాన్ని అంతా పాటించాలి. మనలో మనకి విభేదాలు ఉన్నా పరిష్కారానికి సామరస్య పూర్వక విధానం ఉంటుంది. నేను క్రమశిక్షణతో కూడిన కార్యకర్తలను కోరుకుంటున్నాను.

**పార్టీని బలోపేతం చేసుకుందాం...**

పార్టీలో నాయకుడు వెళ్లిపోయినా ఆ స్థానం ఖాళీ అవుతుంది కానీ పార్టీ ఖాళీ అవదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అంతా సహకరించండి. ఒకరికి పదవి ఇస్తే మిగతా వారు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు రాయిస్తున్నారు. అది ఎవరు చేయించారో ఆధారాలతో సహా చెప్పగలను. దయచేసి కొంత మంది నాయకులు చేస్తున్నారు. అలాంటివి చేయకండి. టీవీల్లో వచ్చే వార్తలు ఎలా వచ్చాయో నాకు తెలుస్తుంది. క్రమశిక్షణ దాటి ప్రవర్తిస్తే చర్యలు తప్పవు. అక్కడి వరకు రాకుండా పార్టీని బలోపేతం చేసుకుందాం. రాబోయే స్థానిక ఎన్నికల్లో మన బలాన్ని నిరూపించుకుందాం. ఎవరో ఒకరు జైలుకు వెళ్తేనే జనసేన పార్టీ, నేను రాజకీయంగా ఎదుగుతామనే చౌకబారు మైండ్ సెట్ నాకు లేదు. అటువంటి ప్రయోజనాల కోసం రాజకీయాల్లోకి రాలేదు. గతంలో తెలుగుదేశం అధ్యక్షులు చంద్రబాబు నాయుడు జైల్లో ఉన్నప్పుడు ఇదే సరైన సమయం, నేను ముఖ్యమంత్రి అయిపోవచ్చు అని ఎప్పుడూ అనుకోలేదు. శత్రువు ఇబ్బందుల్లో ఉండి బలహీనంగా ఉన్నప్పుడు దెబ్బకొట్టే అలవాటు లేదు.. శత్రువు పూర్తి బలంగా ఉన్నప్పుడే ధైర్యంగా ఎదుర్కొని కొట్టడం నా శైలి. రాజకీయ కక్షసాధింపులు, అరెస్టుల కోసం వ్యవస్థలను ఉపయోగించుకోను. ఢిల్లీ వెళ్లి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ లేదా కేంద్ర హోంమంత్రి అమిత్ షా వద్దకు వెళ్లినప్పుడు రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడతాను కానీ... ఎవరినో అరెస్ట్ చేయమనో, గొలుసులు వేయాలనో అడగను. ఎవరు నేరం చేశారు, ఎవరికి ఎలాంటి శిక్ష వేయాలనేది కోర్టులకు బాగా తెలుసు. చర్యకు ప్రతిచర్య కచ్చితంగా ఉంటుంది. మంచి చేసినా, చెడు చేసినా ఎవరు చేసిన పనులు వారికే చుట్టుకుంటాయి. కర్మ ఎవరినీ వదలదు. సెంటిమెంట్ నమ్ముకొని, దాని ఆధారంగా ఏదో అయిపోదామని కొందరు చూస్తున్నారు. వాళ్లకు ఒకటే చెబుతున్నాను. మీ రాజకీయ ప్రయోజనాల కోసం పవన్ కళ్యాణ్ అనే వ్యక్తిని పంచింగ్ బ్యాగ్ లా వాడుకోవద్దు.

**వ్యక్తిగత గౌరవం కారణంగానే ఖండించాను**

వైసీపీ అధినాయకుడుని అరెస్ట్ చేయమని కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా గారికి నేను చెప్పానని, అమిత్ షా గారు ఒప్పుకోలేదని, ఆ విషయాన్ని నాదెండ్ల మనోహర్ శాసనసభ్యులకు చెబితే వాళ్లు ఒక విశ్లేషకుడికి చెప్పారంటా..! ఆ విశ్లేషకుడు చెప్పింది అసలు నమ్మేలా ఉందా? అమిత్ షా దేశంలోనే అత్యంత బలమైన నాయకుడు. సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత దేశంలో అంతటి శక్తిమంతమైన హోంమంత్రి. మూడుసార్లు బీజేపీని దిగ్విజయంగా గెలిపించి, అన్ని రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు వంటి కఠినమైన పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ అసలు దేశంలోనే ఉంటుందా అనే భయాల నుంచి ఆ రాష్ట్రాన్ని బయటకు తీసుకొచ్చిన ఘనత అమిత్ షాదే. అలాంటి ఉన్నత స్థాయి వ్యక్తి గురించి కొందరు తేలికగా మాట్లాడుతుంటే స్థానిక బీజేపీ నాయకులకు ఎంత బాధ ఉందో తెలియదు కానీ...అమిత్ షా పట్ల వ్యక్తిగత గౌరవం కారణంగానే ఈ దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించాల్సి వచ్చింది. ఈ మధ్య కొందరు రాజకీయ విశ్లేషకుడు ఎవరి గురించి అయితే మాట్లాడుతాడో.. ఆ నాయకులకు కులం, ప్రాంతం అనేవి వర్తించవన్నట్లు ప్రవర్తిస్తారని, కానీ విశ్లేషకుడికి మాత్రం కులం వర్తిస్తుందా?అమిత్ షాని, లేదా నన్ను ఏమైనా అనొచ్చు కానీ, తాము మాత్రం సదరు విశ్లేషకులను ఏమీ అనకూడదా? విజ్ఞత, విచక్షణ ఉన్నాయి కాబట్టే సంయమనం పాటిస్తున్నాను. ఒకవేళ ప్రత్యర్థులు యుద్ధమే కోరుకుంటే, వారు ఆశించే యుద్ధాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను.

**మితిమీరిన సహనం చేతకానితనంలా కనిపిస్తోంది**

కొన్ని టీవీ ఛానల్స్ రెండు మూడు నెగిటివ్ ఆర్టికల్స్ రాసి మనల్ని ప్రభావితం చేయాలని చూస్తే ఊరుకునేది లేదు. నా ఓర్పును, మితిమీరిన సహనం చేతకానితనంగా అనుకుంటే, రాబోయే రోజుల్లో తాము కూడా ఎదురుదాడి చేస్తాం. ఒక టీవీ ఛానల్ హెడ్ నిర్వహించే ఫంక్షన్లకు నేను కొన్ని సంవత్సరాలపాటు రెగ్యులర్‌గా వెళ్లాను. ఆపైన కొన్ని కారణాల వల్ల వెళ్లకపోతే నెగిటివ్ ఆర్టికల్స్ రాస్తారు. మళ్లీ వెళ్తే పాజిటివ్‌గా రాస్తారు. మీడియా రంగంలో ఉన్నవారి వ్యక్తిగత జీవితాల గురించి అంతా తెలుసు. కానీ సంస్కారం అడ్డొచ్చి బహిరంగంగా మాట్లాడం లేదు.

**మన రాష్ట్రంలో భిన్నమైన పరిస్థితులు**

తమిళనాడులో ఒక సినిమా హీరో రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి కాగానే, ఇక్కడ నన్ను కూడా సీఎం కావాలంటూ అభిమానులు తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. అక్కడ అభిమానులంతా ఒకే తాటిపై గట్టిగా నిలబడ్డారు కాబట్టే ఆ హీరో ముఖ్యమంత్రి కాగలిగారు. తమిళనాడుతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ సామాజిక పరిస్థితులు పూర్తిగా వేరు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక హీరో రాజకీయాల్లోకి వచ్చేసరికి అభిమానులు కులాలు, ప్రాంతాలు, వివిధ రాజకీయ పార్టీల వారీగా విడిపోతారు. ఇలాంటి తీవ్రమైన వైరుధ్యాలు, కుల సమీకరణాలు ఉన్న వాతావరణాన్ని తట్టుకుని, నేను రాజకీయాల్లో ఈ రోజు ఈ స్థాయి వరకు చేరుకోవడమే అత్యంత కష్టమైన విషయం. కనీసం ఊరు, పేరు లేని ఒక చిన్న గ్రామానికి రోడ్డు వేయించగలిగితే.. నాకు లభించే ఆనందం అంతర్జాతీయ స్థాయిలో ఆస్కార్ అవార్డు గెలుచుకున్న ఆనందంతో సమానం. సరైన రోడ్డు వసతి లేక గర్భిణులు, రోగులను డోలీలలో మోసుకెళ్లే మారుమూల గ్రామాలకు రోడ్లు వేయించి, ఆ కష్టాల నుంచి వారిని గట్టెక్కిస్తే.. అది నాకు ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చినట్లుగా భావిస్తాను. గ్లామర్ ప్రపంచం కంటే క్షేత్రస్థాయిలో ప్రజల కన్నీళ్లు తుడవడం, వారి మౌలిక సమస్యలను పరిష్కరించడమే నాకు ఇష్టం.

**సేనాని చెప్పింది వినండి**

పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ తాను ఇప్పటివరకు ఎప్పుడూ ఇలాంటి చర్యలు తీసుకోలేదు. కానీ మొదటిసారిగా ప్రకాశం జిల్లా కమిటీని పూర్తిగా రద్దు చేస్తున్నాను. ప్రకాశం జిల్లా కమిటీలో ఉన్నది కేవలం పాతిక మందే అయినప్పటికీ, వారి మధ్య 54 గొడవలు ఉన్నాయి. కొత్తవాళ్లను ఎవరినీ పార్టీలోకి రానివ్వకుండా, తాము చెప్పిందే వేదం అన్నట్లుగా కొందరు ప్రవర్తిస్తున్నారు. పార్టీని ఎలా ముందుకు తీసుకువెళ్లాలన్న అంశంలో నేను చాలా స్పష్టంగా ఉన్నాను. నేను రాజకీయంగా చాలా నలిగి ఇక్కడి వరకు వచ్చాను. గతంలో నా పక్కన యూత్ వింగ్ లో కొంత మంది ఉండేవారు. ఎవరైనా ఏమైనా అంటే పొడిచేస్తాం అనేవారు. ఇందిరా పార్క్ వద్ద కాంగ్రెస్ నాయకుల్ని ఒక మాట అన్నానని తెలిసిన వెంటనే అంతా పారిపోయారు. ఇలాంటివన్నీ తట్టుకుని ఇక్కడి వరకు వచ్చాను. పార్టీని నడిపే అంశంలో చాలా స్పష్టంగా ఉన్నాను. నన్ను మీరు సేనాని అన్నారు. మీ సేనాని చెప్పింది మీరు వినండి" అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్ , కందుల దుర్గేష్ , శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్‌గా వేగుళ్ళ లీలాకృష్ణ , పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం ఏటిగట్టు

# ప్రతిపాదన పరిశీలన చేసిన పవన్



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం మధ్యాహ్నం విజ్జేశ్వరంలో పర్యటించారు. విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం వరకు మూడు మండలాలు, 33 కిలోమీటర్ల పొడవున బీటీ రోడ్డు అవసరాన్ని ఇటీవల మంత్రి కందుల దుర్గేష్ ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా రోడ్డు వేయాల్సిన ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. విజ్జేశ్వరం, పురుషోత్తపల్లి, పందలపర్రు, పెండ్యాల, ఉసురుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం, కడింపాడు, దొంగరావిపాలెం తదితర గ్రామాలను కలుపుతూ నిర్మించాలని కోరుతున్న ఈ రోడ్డు వల్ల వేలాది మందికి ప్రయోజనం కలుగుతుందని కందుల దుర్గేష్ తెలిపారు. వచ్చే గోదావరి పుష్కరాలకు రవాణా మార్గం సులువు అవుతుందనీ, వరద కాలంలో గట్టు పర్యవేక్షణ ఈ రోడ్డు వల్ల సులభమవుతుందని చెప్పారు. ఆ మార్గాన్ని ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. ఏళ్లుగా పెండింగ్లో ఉండిపోయిన ఈ రోడ్డు నిర్మాణంపై ఒక నివేదిక ఇవ్వాలని, ఇందుకు సంబంధించి ప్రత్యామ్నాయ మార్గాలు కూడా అన్వేషించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఉప ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్ ఉన్నారు.

# పవన్ కళ్యాణ్ పర్యటన పూర్తిగా వ్యర్థం

**పర్యటన సందర్భంగా ఆర్యాపురం వీధులపై ఆంక్షలు విధించటం బాధాకరం : మేడా**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉప ముఖ్యమంత్రి పర్యటనకే ఇంత హైరనా పడితే 2027-పుష్కరాలు ఏమి నిర్వహించగలరు అని మేడా శ్రీనివాస్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఆర్యాపురం లోగల రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం గల వీధిలో ఏమర్జెంసి ఆసుపత్రులు, విద్యా సంస్థలు, దేవాలయాలు, కళ్యాణ మండపం వున్నాయి అని గమనించకుండా పవన్ కళ్యాణ్ పర్యాటన అక్కడే ఖరారు చేయటం అనాలోచితం కాదా! ఆర్యాపురంలో గత 10 రోజులుగా పారిశుద్యం లేదు. ఉప ముఖ్యమంత్రి పర్యాటన సందర్భంగా ఈ రోజు శుభ్రపరిచారు. రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ పనితీరుపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఉప ముఖ్యమంత్రి పర్యాటన సందర్భంగా అంత ప్రాముఖ్యత గల ఆర్యాపురం రోడ్డులో నిత్యం అంబులెన్స్‌లు తిరుగుతాయి. నివాశితుల భవంతుల వాహనాలు ఉంటాయి. వాటికి ప్రత్యామ్నయంగా సుబ్రహ్మణ్యం మైదానం లో వాహనాలు నిలుపుకోమని సూచించకుండా ఈ వీధిలో ఏ ఒక్క వాహనాలు నిలుపరాదని నియంత వలే ఆక్షలు విధించటం సామజిక ద్రోహం. ఇంతటి మండుటి ఎండలో ఏమాత్రం ఉపయోగం లేని పవన్ కళ్యాణ్ పర్యాటన కు పోలీస్ తీవ్రమైన ఎండ పోటుకు గురయ్యారు. కనీసం పోలీస్ కానిస్టేబుల్ నుండి ఎస్ ఐ వరకు వారికి సరైన సౌకర్యాలు చూసేటోళ్ళు లేకపోయారు. మంచినీళ్లు సైతం వారికి అందించే వారు లేకపోయారు. పవన్ కళ్యాణ్ పర్యటన పూర్తిగా వ్యర్థం. ఈ మాత్రం సమీక్ష సమావేశం వి.సి.లో కూడా కూడా నిర్వహించ వచ్చును అని ప్రభుత్వ అధికారులే చర్చించుకోవటం విశేషం. ప్రభుత్వం సమర్థులైన అధికారులకు రాజమండ్రి పుస్కర బాధ్యతలు అప్పగించే విధంగా ఆలోచనలు చేయాలి. ఇలాంటి అనాలోచిత చర్యలు అమలు చేస్తే ప్రజా అగ్రహానికి గురికాక తప్పదన్నారు.

మహానాడు పోస్టర్‌ను

# ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న క్లస్టర్ మహానాడును విజయవంతం చేయాలని పిలుపు**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న తెలుగుదేశం పార్టీ క్లస్టర్ మహానాడును విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. మహానాడుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో యువ నాయకులు బండారు సంజీవతో కలిసి ఆయన ఆవిష్కరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. క్లస్టర్ల వారీగా బలోపేతానికి ఈ మహానాడు ఉపయోగపడుతుందన్నారు.

# రాజానగరం అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజన సమర్పణ


**బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ ఖండవల్లి లక్ష్మి జన్మదిన వేడుకలు - అభిమానులు నాయకులు కార్యకర్తల సమక్షంలో పలు సేవా కార్యక్రమాలు**



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి , పేదల పాలిట పెన్నిధి, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆంధ్ర, తెలంగాణ) మహిళా చైర్ పర్సన్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా సెక్రటరీ, ఆల్ ఇండియా షెడ్యూల్డ్ కులాల రాష్ట్ర మహిళా విభాగం ప్రెసిడెంట్ డాక్టర్ ఖండవల్లి లక్ష్మి జన్మదిన వేడుకలు కార్యకర్తలు, అభిమానులు, టీడీపీ నాయకులు మధ్య సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక దివాన్ చెరువులో ఉన్న ఖండవిల్లి లక్ష్మి నివాసానికి పెద్దఎత్తున చేరుకున్న రాజకీయ పార్టీల నాయకులు, క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లు, పాస్టరమ్మలు ఆమెకు పుష్పగుచ్చాలు అందచేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమలలో భాగంగా రాజానగరం అన్న క్యాంటీన్‌లో పేదలకు డాక్టర్ ఖండవిల్లి లక్ష్మి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజానగరం మాజీ ఎమ్మెల్యే, సిఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ తనయుడు పెందుర్తి అభిరామ్ విచ్చేసారు. వారు స్వయంగా ఆహార పదార్థాలు వడ్డించారు. అనంతరం ఆమె నివాసం వద్ద బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్ ఫాదర్లు కె.రాజు, ప్రశాంత్, చినబాబు, కె.విజయకుమార్ ప్రార్థనలు నిర్వహించి సన్మాన పత్రం, పుష్పమాలతో ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు. ఫాదర్లు మాట్లాడుతూ ఎంతో గొప్ప మానవతా వాదిగా ఖండవిల్లి లక్ష్మి సమాజంలో అన్యాయానికి గురవుతున్న అభాగ్యుల వెంట నిలబడి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారని కొనియాడారు . డాక్టర్ ఖండవల్లి లక్ష్మి కు ఆ యేసు క్రీస్తు ఎల్లవేళలా దీవెనలు,



ఆశీర్వాదాలు, సంపూర్ణ ఆరోగ్యం కలగ చేయాలని ప్రార్థించారు. రాజకీయంగా కూడా మంచి ఉన్నత పదవులు దక్కాలని ఆకాంక్షించారు. ఖండవిల్లి లక్ష్మి మాట్లాడుతూ తనపై ఇంత అభిమానం చూపుతున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. వారికి ఎటువంటి సమస్య వచ్చినా అండగా నిలబడతానని భరోసా ఇచ్చారు. అందరికి అండగా నిలబడుతూ ముందుకు సాగుతానని తెలిపారు. ఆమెకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజానగరం, కోరుకొండ, సీతానగరం, రాజమండ్రి సిటీ నుంచి పెద్దఎత్తున ఎంఆర్‌పిఎస్ నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, దళిత వివిధ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.



రామచంద్రపురంలో

# అదనపు కోర్టు భవన ఏర్పాటుకు చర్యలు

## మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలో నూతనంగా మంజూరైన అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నిర్వహణకు తగిన భవనాన్ని కేటాయించాలని కోరుతూ రామచంద్రాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు సోమవారం సాయంత్రం రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్స్ మరియు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ ను టిడిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటిపల్లి లోవరాజు మాట్లాడుతూ ప్రస్తుత కోర్టుల ప్రాంగణంలోనే ఖాళీగా ఉన్న పాత మండల రెవెన్యూ కార్యాలయ భవనాన్ని అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఏర్పాటుకు అనుమతిస్తూ ఉత్తర్వులు మంజూరు చేయించాలని మంత్రిని కోరారు. కక్షిదారుల సౌకర్యార్థం మరియు న్యాయ ప్రక్రియ వేగవంతం కావడానికి ఈ అదనపు కోర్టు ఏర్పాటు ఎంతైనా అవసరమని కావున పాత రెవెన్యూ భవనాన్ని దీనికి కేటాయించేలా సహకరించాలని పలువురు సీనియర్ న్యాయవాదులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల వినతిపై మంత్రి వాసంశెట్టి సుభాష్ సానుకూలంగా స్పందించారు. రామచంద్రపురంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు పాత మండల రెవెన్యూ కార్యాలయ భవనాన్ని కేటాయించేలా ప్రభుత్వం తరపున ఖచ్చితంగా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని న్యాయవాదుల బృందానికి మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, సీనియర్ న్యాయవాదులు పద్మనాభ రాజు, కముజు సూర్యనారాయణ, చిప్పాడ గోవిందా చార్యులు, వెలగల నరేందర్ రెడ్డి, బి.తారకేశ్వరరావు, ఆనాల గంగాభవాని, పిల్లా పృథ్వి, సూదం శెట్టి వవిత, శాఖ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి వర్చువల్‌గా

# శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటుతో పారిశ్రామిక అభివృద్ధికి నాంది - ప్రతీ ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**మహిళలు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కొత్తపేట ఎమ్మెల్యే బండారు**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతీ ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. సోమవారం రావులపాలెం మండలం దేవరపల్లిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు, ఆర్డీఓ జి.మమ్మి,జోనల్ మేనేజర్ రమణారెడ్డి, డిఎల్‌డిఓ రాజేశ్వరరావు, ఇండస్ట్రియల్ జిమ్ అరుణ, ఏపీ ఇండస్ట్రీ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టపర్తి భారతి మరియు యువ నాయకులు బండారు సంజీవ్ తో కలిసి వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు భూమి పూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలో రావులపాలెం మండలం దేవరపల్లిలో 3 ఎకరాల 30 సెంట్ల స్థలంలో మంచి కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. కోనసీమ లాంటి మారుమూల జిల్లాలో, మారుమూల ప్రాంతంలో ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో ఉన్న ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడానికి, పారిశ్రామిక అభివృద్ధికి నాంది పలకడం జరుగుతుందన్నారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఎన్డీఏ కూటమి నేతృత్వంలో ఎమ్ఎస్ఎమ్ఈ పరిశ్రమల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం కోసం కృషి చేస్తున్నారన్నారు. త్వరితగతిన ఈ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు. యువకులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత, మహిళా పారిశ్రామికవేత్తలు సొంతంగా తమ కాళ్ళ మీద తాము నిలబడేలా తయారీ పరిశ్రమలుగాని, సేవా రంగ పరిశ్రమలుగాని, స్టోరేజెస్ గాని, అసెంబ్లింగ్ యూనిట్లు, కొబ్బరి, అరటి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేసుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలి : కలెక్టర్ మహేష్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి సుమారు 250 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలు, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి వారికి న్యాయం చేయడమే జిల్లా యంత్రాంగం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. సమయపాలనతో పాటు నాణ్యమైన పరిష్కారం అందించాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్లక్ష్య ధోరణి లేకుండా నిర్దేశిత గడువులోగా అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేవలం కాగితాలకే పరిమితం కాకుండా అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి సమస్య తీవ్రతను బట్టి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో ఆశలతో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ జిల్లాస్థాయి అధికారులు నిర్దేశిత గడువులోగా అర్జీల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీలు తిరిగి రీఓపెన్ కాకుండా చూడాలని, అర్జీదారులకు సకాలంలో సమాచారం అందిస్తూ పారదర్శకత పాటించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి సకాలంలో నూటికి నూరు శాతం సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులకు సూచించారు. శాఖాధిపతులు ప్రజా ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి శాశ్వత పరిష్కారాలు చూపాలన్నారు. ప్రజా సేవలకు సంబంధించిన ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కరించిన ప్రతి ఫిర్యాదులో నాణ్యమైన, శాశ్వత పరిష్కారం ఉండాలని పేర్కొన్నారు. శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి వచ్చిన ప్రతి ఫిర్యాదును సమర్థవంతంగా పరిష్కరించాలని సూచించారు. పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారంలో హేతుబద్ధత ఉండాలని, అర్జీలను సమగ్రంగా పరిశీలించి తగిన పరిష్కార మార్గాలను త్వరితగతిన అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.సుబ్బారావు, డ్వామా పీడీ రాంబాబు, స్వర్ణ వార్డు--స్వర్ణ గ్రామం నోడల్ అధికారి విజయలక్ష్మి, డీఎల్డీవో వేణుగోపాల్ తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కార్యకర్తల్లో నిరుత్సాహం కలిగించిన మహానాడు రద్దు




## ఇంధన పొదుపు లక్ష్యంతో మహానాడు

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగువారికి సంక్రాంతి పెద్ద పండగ తెలుగుదేశం కార్యకర్తలకు మహానాడు పండగ డిజిటల్ వేదికగా ఈసారి మహానాడు నిర్వహణ.. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న నందమూరి తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా మహానాడు నిర్వహిస్తోంది. ఇది పూర్తిగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పండగ.దేశం నలుమూలల నుండి కార్యకర్తలు విచ్చేసి దీనిని ఎంతో ఘనంగా జరుపుకుంటారు. ప్రతి ఏటా రాష్ట్రంలో ఒకచోట ఒక వేదికగా మహానాడును జరుపుకోవడం ఆనవాయితీ. ఈసారి నెల్లూరులో జరపాలని నిర్ణయించారు. కనివిని ఎరగని రీతిలో నెల్లూరులో మహానాడు ను జరపాలని కృత నిశ్చయంతో ఉన్ననెల్లూరు నాయకులు రద్దు చేయడంతో నిరాశ చెందారు.ప్రధానమంత్రి మోడీ ఇంధనం పొదుపు చేయాలన్న పిలుపును అనుసరించి ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ కాన్వాయ్ లను తగ్గించుకున్నారు.మోడీ మాటకు మరింత విలువనిస్తూ వ్యక్తిగతంగా కాకుండా పార్టీకి సంబంధించినటువంటి అంశమైన మహానాడు పండగను కూడా రద్దు చేశారు.ఇది కార్యకర్తల్లో నిరుత్సాహాన్ని నింపింది. ఉత్సాహం కలిగించేందుకు గాను డిజిటల్ వేదికగా ఈసారి మహానాడు ను నిర్వహిస్తున్నారు.ఈసారి డిజిటల్ వేదికగా పసుపు పండుగ!ఇంధన పొదుపులో భాగంగా ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకుని మే 27,28 తేదీలలో డిజిటల్ వేదికగా రాష్ట్రవ్యాప్తంగా 1848 క్లస్టర్ల ద్వారా ప్రతి కార్యకర్తకు చేరువగా ఈసారి మహానాడు నిర్వహిస్తున్నారు.కొత్తపేట నియోజకవర్గంలో బండారు సత్యానందరావు డిజిటల్ వేదికగా మహానాడును జరిపేందుకు క్లస్టర్ల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. వేసవి దృష్టిలో ఉంచుకుని ఏసీ కళ్యాణ మండపాలలో నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించారు. పెద్ద పెద్ద ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసి ఆన్ లైన్ ద్వారా ప్రత్యక్ష ప్రచారంలో పాల్గొని విధంగా ఏర్పాటు చేస్తున్నారు.ఏ ప్రాంతంలో ఉన్నవారు ఆ ప్రాంతంలోనే మహానాడు జరుపుకోవడం సరికొత్త నూతన విధానం..నూతన అధ్యాయానికి నాంది పలుకుతున్న డిజిటల్ మహానాడు ను స్వాగతించి ఘనంగా జరుపుకుందాం ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి పిలుపు నిచ్చారు.

జిల్లా ఉన్నత పాఠశాల మెర్లపాలెం విద్యార్థుల చేరికలను

# ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రత్యేక అవగాహన క్యాంపెయిన్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామంలో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ బోధన వంటి సౌకర్యాల గురించి వివరించారు. ప్రతి చిన్నారికి విద్య హక్కు అని, సమీప ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తమ విద్య లభిస్తుందని గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆర్.వి.వి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని కోరారు. గ్రామ పెద్దలు కూడా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. క్యాంపెయిన్‌లో భాగంగా విద్యార్థులను పాఠశాలలో చేరదీసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని అభినందించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు వచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, గ్రామ పెద్ద కొమ్మర రాఘవ మరియు ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌ని

# కలసిన బండారు శ్రీనివాస్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే 2027 గోదావరి పుష్కరాల పనులను పరిశీలించడానికి రాజమండ్రి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ని కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ షెల్టాన్ హోటల్ నందు మర్యాద పూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు.

హైదరాబాద్ నడి బొడ్డున ఏర్పాటు కానున్న

# ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహం

## కొత్తపేట వడయార్ శిల్ప శాల నుండి తరలిన ఎన్టీఆర్ విగ్రహం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మే 28న ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి కొత్తపేటలో రూపుదిద్దుకున్న 13 అడుగుల ఎన్టీఆర్ కాంస్య విగ్రహం కొత్తపేట వడియార్ శిల్ప శాలలో కళా శిల్పి రాజ్ కుమార్ వడయార్ చేతిలో రూపుదిద్దుకున్న నందమూరి తారక రామారావు విగ్రహాన్ని హైదరాబాదుకు తరలించారు. తెలుగుజాతి ఖ్యాతిని దశదిశలా చాటిన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం అపూర్వ నివాళి అర్పిస్తోంది.హైదరాబాద్ నడిబొడ్డున అన్నగారి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు సర్వాంగ సుందరంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 28న (ఎన్టీఆర్ జయంతి) అమీర్‌పేటలోని మైత్రీవనం కూడలిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని లాంఛనంగా ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచిన తర్వాత హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న తొలి ఎన్టీఆర్ విగ్రహం ఇదే కావడం విశేషం.23 అడుగుల ఎత్తులో సజీవ రూపం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన ప్రముఖ శిల్పి, కళారత్న డి. రాజ్‌కుమార్ ఉడయార్ రెండు నెలల పాటు శ్రమించి ఈ అద్భుత కాంస్య విగ్రహాన్ని తయారు చేశారు.విగ్రహాన్ని కొత్తపేట వడియార్ శిల్పశాల నుండి క్రేన్ సహాయంతో లారీలో ఎక్కించి హైదరాబాదుకు తరలించారు.విగ్రహం తరలింపు కార్యక్రమంలో టిడిపి నాయకులు కంఠం శెట్టి శ్రీను గుబ్బల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో జరిగే

# మహానాడుని విజయవంతం చేయాలి

## టిడిపి నాయకులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్ వారీ జరుగుతున్న మహానాడు 2026 కొత్తపేట నియోజకవర్గం కొత్తపేటలో విజయవంతం చేయాలని కొత్తపేట తెలుగుదేశం పార్టీ పార్టీ శ్రేణులను కోరింది. క్లస్టర్ 6 సమావేశం కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో క్లస్టర్ ఇంచార్జ్ కంఠంశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది.27, 28 తేదీల్లో రెండు రోజులపాటు కళ్యాణ మండపంలో జరిగే మహానాడు సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొంటారని బూత్ కన్వీనర్లు మొదలుకొని పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని సమావేశం కోరింది.మహానాడులో చర్చించాల్సిన విషయాలపై పార్టీ నేతలు వివరించారు. సమావేశంలో బండారు సందీప్, జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు ముత్యాలు బాబ్జి, క్లస్టర్ కోకన్వీనర్ బూసి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, సీనియర్ నాయకులు ధర్నాల రామకృష్ణ, చింతం విజయ్ కృష్ణమోహన్, ఎల్లమెల్లి జగన్మోహన్, మిద్దె ఆదినారాయణ, వాసంశెట్టి సత్యనారాయణ, దేవపాటి వెంకటేశ్వరావు, సిద్దంశెట్టి సత్యనారాయణ, విల్ల మారుతి, చోడపనీడి భాస్కరరావు, కడలి భీమేశ్వరరావు, ఎలిశెట్టి ప్రభాకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వచ్చే బుధవారానికి అందుబాటులోకి

# ఏనుగుల మహల్ సబ్ స్టేషన్

## విద్యుత్ సమస్యలపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గంలో కొత్తగా 69 ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు. అధిక ఉష్ణోగ్రతలతో డిమాండ్ పెరిగి విద్యుత్ సమస్యలు తలెత్తున్నాయి. విద్యుత్ వాడకంలో వినియోగదారులు అధికారుల సూచనలు పాటించాలి. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిన వేసవి అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా లోడ్ పెరిగి ఈ మధ్య విద్యుత్ సరఫరాలో సమస్యలు ఎదురవుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులు తగ్గించడానికి, వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి విద్యుత్ సిబ్బంది ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. పెరిగిన విద్యుత్తు డిమాండ్, విద్యుత్ సరఫరాలో సమస్యలకు సంబంధించి క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులు కొత్తపేట డీఈఈ డి.చిట్టిరాజు, మండపేట డి ఈ ఈ సి.హెచ్. శ్రీధర్, రావులపాలెం ఏఈ పి.నరేష్, ఆలమూరు ఏఈ డి.ఎం.కె.దుర్గాప్రసాద్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యువ నాయకులు బండారు సంజీవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గ పరిధిలో నూతనంగా 69 ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యుత్ డిమాండ్ పెరిగిపోయి ట్రాన్స్ఫార్మర్లు ఫెయిలవ్వడం, కాలిపోవడం జరుగుతుందన్నారు. ఎక్కడ ట్రాన్స్ఫార్మర్ కాలిపోయిన వెంటనే మరమ్మత్తు చేయడానికి 50 ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో మంజూరుతో సంబంధం లేకుండా సత్వరం ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోమని అధికారులకు తెలియజేస్తున్నారు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు ఎక్కువగా ఏసీలు ఉపయోగించడం వల్ల లోడ్ అధికంగా అవుతుందన్నారు. వినియోగదారులు సహృదయంతో అర్థం చేసుకొని విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. ఎక్కడ విద్యుత్ సమస్య తలెత్తిన వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన తర్వాత మరలా సరఫరా ప్రారంభమైన వెంటనే ఏసీలు ఆన్ చేయడం వల్ల లో వోల్టేజ్ వచ్చి కాలిపోయే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వెంటనే ఏసీలు ఆఫ్ చేయడం, తిరిగి సరఫరా ప్రారంభమైన అరగంట తరువాత ఏసీలు ఆన్ చేయడం వల్ల విద్యుత్ పరికరాలు, సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. బుధవారానికల్లా ఏనుగుల మహల్ సబ్ స్టేషన్ అందుబాటులోకి వస్తుందన్నారు. 33/11 నర్సిపూడి సబ్ స్టేషన్ సాంక్షన్ అయ్యిందన్నారు. ఆత్రేయపురం, రావులపాలెం మండలం పరిధిలో ఎక్కడైనా సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా, లో వేల్టేజ్ సమస్యలు తలెత్తకుండా, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ మల్లమ్మ తల్లి జాతర



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండలం, ఉప్పుడి గ్రామం ఇరుమండలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ మల్లమ్మ తల్లి జాతర సందర్భంగా సోమవారం భారీ అన్న సమారాధన జరిగింది అదే రోజు సాయంత్రం భారీ ఎత్తున మేళా తాళాలతో, భాజా భజంత్రిలతో గరగ నృత్యాలు, సాంస్కృతిక పరమైన కార్యక్రమాలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంగరంగ వైభవం అమ్మవారిని ఊరేగించారు.



## అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి

# నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి

### పీజీఆర్ఎస్‌కు 316అర్జీలు : జిల్లా కలెక్టర్ల హరేంధిర ప్రసాద్

**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎస్ మధుసూదన్, డీఎల్డీవో వాసుదేవరావు తదితర అధికారులతో కలిసి హాజరై, జిల్లాలోని చుట్టుపక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం, సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు,



ఉద్యోగ ఉపాధి అవకాశాలు, మురికి కాలువలపై ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై మొత్తం 316అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పరిష్కరించా లన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలోను, రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా ఆడిట్ నిర్వహిస్తుందన్నందున అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వివిధ శాఖలలో నమోదైన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు అర్జీల సక్రమ పరిష్కారానికి నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా కాకినాడ కలెక్టరేట్లో ఏర్పాటు ఎమర్జెన్సీ కాల్ సెంటర్కు వచ్చిన సమస్యలకు తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్‌కు 61 అర్జీలు**

రెవిన్యూశాఖలో సమస్యల పరిష్కారం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతివారం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వివేకానంద హాలుపైన జరిగింది. ఈ కార్యక్రమంలో డీఆర్వో టి తిప్పే నాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, ఎన్ శ్రీధర్, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి రత్నమణిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే, భూముల వివరాలు ఆన్ లైన్‌లో నమోదు, జాయింట్ ఎల్పీఎంలు, 22ఏలోని భూములు, సర్వే నెంబర్లు ఇతర రెవెన్యూ అంశాలపై మొత్తం 61 అర్జీలు అందాయని డీఆర్వో తిప్పే నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్ రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లతో అర్జీల పరిష్కార పురోగతిపై సమీక్ష నిర్వహించి ఈ అర్జీలను సకాలంలో పూర్తిగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమాలలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# "మహానాడు 2026"ని విజయవంతం చేద్దాం

### ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిలుపు - ఈ సారి ప్రపంచ వ్యాప్తంగా వర్చువల్ మహానాడు
### ప్రత్తిపాడు నియోజకవర్గం 10 క్లస్టర్లకు ఏర్పాట్లు - శంఖవరం మండలం అన్నవరంలో రెండు వేదికలు
### ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేష్

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వర్చువల్ విధానంలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహిస్తున్న పసుపు పండగ 'మహానాడు 2026'లో ప్రతి ఒక్కరం భాగస్వాములం అవుదాం. తెలుగుదేశం పార్టీ ఆత్మ గౌరవాన్ని, పార్టీ సిద్ధాంతాలను మరింత బలోపేతం చేసే ఈ మహాసభను విజయవంతం చేద్దాంమని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శాసనస భ్యురాలు వరుపుల సత్యప్రభ పిలుపును ఇచ్చారు. డిజిటల్ వేదికల ద్వారా జరిగే ఈ కార్యక్రమానికి ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆమె సోషల్ మీడియా డిజిటల్ వేదికల ద్వారానే ఆహ్వానించారు. డిజిటల్ వేదికపై పసుపు జెండా రెపరెపలాడే వేళ. పొదుపు చర్యలకు ప్రాధాన్యత ఇస్తూ వర్చువల్ మహానాడు 2026 వేడుకలను డిజిటల్ గళంతో పసుపు సైన్యం శక్తిని చాటి చెప్పాలని ఆమె సూచించారు. ప్రపంచంలో ఎక్కడున్నా తెలుగు తమ్ముళ్లు అందరినీ ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకువచ్చే మహోత్సవమే ఈ డిజిటల్ మహానాడు. కార్యకర్తలు, స్థానిక నాయకులు ఆందరూ తమ పరిధిలోని క్లస్టర్ల నుంచే వర్చువల్ పద్ధతిలో ఈ వేడుకల్లో ప్రత్యక్షంగా భాగస్వాములు అవ్వండి. ఆన్‌లైన్ ద్వారా క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో సమీక్షలు నిర్వహించి, గ్రామ, బూత్ కమిటీ సభ్యులు అందరినీ




భాగస్వామ్యం చేస్తూ ఈ డిజిటల్ విధానంలోని మహానాడు పండుగ వాతావరణంలో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిలుపును ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక వార్షిక పండుగైన 'మహానాడు' ఈ ఏడాది వర్చువల్ (హైబ్రిడ్) విధానంలో జరగనుంది. మంగళగిరిలోని టిడిపి జాతీయ కేంద్ర కార్యాలయం ప్రధాన వేదికగా ఈ కార్యక్రమం ప్రధానంగా సాగుతుంది. ఇక్కడి నుండి పొలిట్ బ్యూరో, జాతీయ మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు. నిజానికి ఈసారి మహానాడును నెల్లూరులో ఘనంగా నిర్వహించాలని భావించారు. అందుకు వందలాది ఎకరాల భూమిని కూడా చదునుచేసి సిద్ధం చేశారు. అయితే, అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు నిచ్చిన ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈసారి వర్చువల్ విధానంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సారి మహానాడును 'స్త్రీ శక్తి మహానాడు' అనే ప్రత్యేక థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళలను రాజకీయంగా, సామాజికంగా పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,875 క్లస్టర్ కేంద్రాల్లో ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్లు, నాణ్యమైన సాంకేతిక వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను రాష్ట్ర పార్టీ కార్యదర్శి, అన్నవరం రత్నగిరి దేవస్థానం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు పర్వత సురేష్ సోమవారం సాయంత్రం పరిశీలించారు.

### "పదిలం"కు మాస్కో రీసెర్చ్ యూనివర్సిటీ

# గౌరవ డాక్టరేట్ అవార్డు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైద్యో నారాయణో హరిః అన్న నానుడిని అక్షరాలా నిజం చేస్తూ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం, ఆ పరిసర ప్రాంతాల ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ ఆదర్శ వైద్యుడిగా ప్రశంసలు అందుకుంటున్న ఆర్.ఎం.పి వైద్యులు, అవార్డుల రారాజు పదిలం బెన్నబాబుకు మరో గౌరవ డాక్టరేట్ పురస్కారం వరించింది. రష్యాలోని మాస్కో రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరాఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ ఇన్ రూరల్ హెల్త్ కేర్ అండ్ కమ్యూనికేషన్ వెల్ఫేర్ విభాగంలో ఈ గౌరవ డాక్టరేట్ ను యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మైకేల్ వి కొజనెట్సోవ్ సోమవారం పదిలంకు ప్రకటించారు. బెన్నబాబు ఇప్పటికే మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్ న్యూఢిల్లీ గౌరవ డాక్టరేట్, సహారా చారిటబుల్ ట్రస్ట్ గౌరవ డాక్టరేట్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ రైజింగ్ స్టార్ అవార్డ్, మదర్ థెరీసా బుక్ ఆఫ్ ఇండియా ప్రైడ్ మదర్ థెరీసా అవార్డ్, ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ స్టార్ అవార్డ్, రాష్ట్రీయ పరిషత్ పురస్కార్ అవార్డ్, వైద్యో నారాయణ్ సేవా అవార్డ్, మహాత్మాగాంధీ నేషనల్ అవార్డ్, గ్లోబల్ ఐకాన్ అవార్డ్, ఇంటర్నేషనల్ అచీవర్స్ అవార్డ్, భారతీయ గౌరవ్ ప్రతిభ సమాన్ అవార్డ్ తదితర అనేక పురస్కారాలను బెన్నబాబు లోగడ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన తనకు మాస్కో యూనివర్సిటీ డాక్టరేట్ రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. వృత్తినే దైవంగా భావిస్తూ, తన సమీపంలోని పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ తాను చేస్తున్న పనిని గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రకటించిన యూనివర్సిటీ ఎంపిక బృందానికి కృతజ్ఞతలను తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు ఆయనకు తమ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# బస్సులో టికెట్ వివాదం

### బస్సును పోలిస్ స్టేషన్‌కు తరలించిన డ్రైవర్




**వినుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్టీసీ బస్సులో జరిగిన టికెట్ వివాదం అద్దంకి పోలీస్ స్టేషన్ చేరింది. ఆదివారం వినుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అద్దంకి మీదుగా ఒంగోలు వెళుతోంది. వినుకొండలో బస్సు ఎక్కిన ఓ యువకుడు తాను జర్నలిస్టుగా పరిచయం చేసుకుని తనకు రాష్ట్రస్థాయి 1/3 టికెట్ ఇవ్వాలని కండక్టర్‌ను కోరాడు. కండక్టర్ బస్సు పాస్ ను పరిశీలించగా అది కలర్ జిరాక్స్ గా గుర్తించి ఒరిజినల్ కావాలని అడిగింది. దీంతో ప్రయాణికుడు కండక్టర్ పై వాగ్వివాదం చేసుకున్నాడు. సహచర ప్రయాణికులు వారిస్తున్నప్పటికీ అద్దంకి వచ్చే వరకు అతను కండక్టర్ తో వివాదం కొనసాగుతూనే ఉంది. దీంతో డ్రైవర్ బస్సును అద్దంకి పోలీస్ స్టేషన్ కు మళ్లించగా, వివాదానికి కారకుడైన యువకుడి పై మహిళా కండక్టర్ లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. అనంతరం ఆ యువకుడు తన ప్రవర్తన కరెక్ట్ కాదని క్షమాపణలు తెలిపి మరోకసారి ఇలా ప్రవర్తించినని లేఖ రాసి పోలిసులకు ఇవ్వడంతో, పోలిసులు ఆ యువకుడుని మందలించి పంపినట్లు ప్రయాణికులు తెలిపారు.

### హెల్మెట్‌తో ప్రయాణం

# సురక్షితం.. శుభప్రదం.. : ట్రాఫిక్ పోలీస్

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** హెల్మెట్ లేని వాహనదారులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు మంగళవారం కాకినాడ కల్పనా సెంటర్ వద్ద ట్రాఫిక్-1 పోలీసులు హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "హెల్మెట్ ధరించి ప్రయాణిస్తే - అది మీ ప్రాణాలను కాపాడుతుంది" అనే నినాదంతో ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై సూచనలు అందించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు వెయ్యి రూపాయలు జరిమానా విధించే బదులుగా, వారికి కొత్త హెల్మెట్లు కొనిపించి తలపై ధరింపజేసి అవగాహన కల్పించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మైనర్లతో వాహనాలు నడపించడం, బైక్ స్టంట్లు చేయడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రాష్ అండ్ నెగ్లిజెన్స్ డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని వివరించారు. రెడ్ సిగ్నల్ పడినప్పుడు వాహనదారులు తప్పనిసరిగా స్టాప్ లైన్ వెనుక వాహనాలు ఆపాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఆటోమేటిక్ ఫైన్ జనరేషన్ సిస్టమ్ ద్వారా ఈ-చలానాలు జారీ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్ రమేష్ మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.





# పోలీస్ సేవలను అభినందించిన బాదం బాలకృష్ణ



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ సినిమా రోడ్డులో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్-1 పోలీస్ సిబ్బంది సేవలను రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ (1978) చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బాదం బాలకృష్ణ అభినందించారు. సోమవారం 45 వేల విలువగల స్టీల్ వాటర్ బాటిల్లు, గ్లూకోజ్ ప్యాకెట్లను అందించారు. ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు. ప్రత్యేకంగా ట్రాఫిక్-1 సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ విధులు నిర్వర్తించడం అభినందనీయమన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీసులు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో మంచి స్పందన పొందుతున్నాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ సీఐ ఎన్ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తున్నారని, ప్రజల భద్రత కోసం అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బందికి ట్రస్ట్ తరఫున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శీమకుర్తి పాపారావు, ఎస్సై సి.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో

# కక్షి దారులకు కనీస అవసరాల కరువు




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వానికి ఆదాయం వచ్చే ముఖ్యమైన రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కనీస అవసరాలు కరువయ్యాయి ఆదాయం ఘనంగా వస్తున్నా పౌర సేవలలో మాత్రం ఆ కార్యాలయం నామమాత్రంగానే ఉన్నది. ప్రజల నుండి రిజిస్ట్రేషన్ ఫీజులు వసూల్ చేస్తూ వారి బాధలు పట్టించు విధానం అక్కడ లేదు. వాహనాల పార్కింగ్ ఫీజు మాత్రం చక్కగా వసూలు చేస్తున్నారు. కాకినాడ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ నిమిత్తం ఎంతో మంది ప్రజలు వస్తూ వెళ్తూ ఉంటారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్ల సౌకర్యం, తాగునీరు, అవసరమైనన్ని కుర్చీలు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. క్రింది స్థాయిలో అవినీతి బాగా పెరిగిపోయిందని సౌకర్యాలు కల్పనలో మాత్రం చాలా దూరం ఉన్నాయని వచ్చిన వారు వాపోతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు పరిశీలించి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

# హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

### సాంకేతిక ఆధారాలతో కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసులు
### అక్రమ సంబంధం నేపథ్యంగా హత్య : సీఐ ఎం నాగ దుర్గారావు వెల్లడి



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును పోలీసులు త్వరితగతిన ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వార్ఫ్ రోడ్‌లో టిబి ఆస్పత్రి ఎదురుగా ఈ నెల 20న జరిగిన హత్య ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సిఐ ఎం.నాగ దుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్ బస్టాండ్ ప్రాంతానికి చెందిన కర్రి చందు(39) అనే వ్యక్తి జువెనైల్ తల్లితో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో జువెనైల్ మరో ఇద్దరి సహాయంతో దాడికి పాల్పడ్డాడు. రాయితో కొట్టి చంపినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో జువెనైల్‌తో పాటు ప్రేజర్‌పేటకు చెందిన బర్నికల లక్ష్మణరావు అలియాస్ లక్ష్మణ్ అలియాస్ (కడపోడు)(24), వెంకటేశ్వర కాలనీకి చెందిన పంతాడి లక్ష్మణ్(24)లను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో కేసును ఛేదించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును త్వరగా ఛేదించిన వన్‌టౌన్ సిఐ ఎం నాగ దుర్గారావు మరియు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.





# దేశీయ మొక్కలను నాటాలి

**అటవీ శాఖ ప్రాంతీయ పరిశోధన కేంద్రాన్ని పరిశీలించిన పవన్ కళ్యాణ్ - పంచాయతీ వనంతో గ్రామాలకు హరిత హారం**
**వుడ్ బ్యాంక్ కోసం దేశీయ వృక్ష జాతి మొక్కలతో ప్రతి గ్రామపంచాయతీలోనూ ప్రత్యేక వనాలు - మొక్కల పెంపకం భావి తరాలకు నేర్పించాలి**
**ఆదాయం తెచ్చే మొక్కల పెంపకం ద్వారా పంచాయతీలకు ఆర్థిక వృద్ధి**
**పంచాయతీరాజ్ శాఖ, అటవీ శాఖలు ప్రత్యేక ఎంఓయు కుదుర్చుకొని ముందుకు వెళ్లాలి**



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 'ప్రతి గ్రామ పంచాయతీలోనూ దేశవాళి జాతి మొక్కలతో ప్రత్యేక వనాన్ని తయారు చేయాలి. మొక్కలను పెంచే బాధ్యతను గ్రామస్తులు తీసుకోవాలి. గ్రామీణ ప్రజలను భాగస్వామ్యం చేస్తేనే మొక్కల ఎదుగుదల సాఫీగా సాగుతుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశీయ మొక్కలను ఎక్కువగా పెంచితే ప్రకృతి సమతుల్యత సాధ్యమవుతుంది. వెంటనే దీనిపై దృష్టి సారించి పంచాయతీరాజ్ అధికారులు, అటవీశాఖ అధికారుల సంయుక్తంగా ఎం ఓ యు కుదుర్చుకొని వనయజ్ఞం చేపట్టాల'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా సోమవారం మధ్యాహ్నం రాజా నగరంలోని ప్రాంతీయ అటవీ అభివృద్ధి కేంద్రాన్ని పవన్ కళ్యాణ్ పరిశీలించారు. అక్కడ పెంచుతున్న దేశీయ జాతి మొక్కలను, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఎన్ని మొక్కలు ఉన్నాయి..? వాటి ప్రత్యేకతలు ఏమిటి? ఆ మొక్కలను పెంచడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటన్న విషయాలను అటవీ అధికారులు ఉప ముఖ్యమంత్రి వర్యులుకు వివరించారు. ఈ సందర్భంగా ప్రతి మొక్క వివరాన్ని జాగ్రత్తగా విన్నారు. సుమారు 400 రకాల విభిన్న జాతుల మొక్కలు, రెండు లక్షలకు పైగా ఉన్నాయని తెలుసుకొని ఆశ్చర్యపోయారు. ఈ మొక్కలను సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అప్పటికప్పుడు పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజని ఆదేశించారు. అటవీ అధికారులతో ప్రత్యేక ఎమ్ ఓ యు కుదుర్చుకొని విశిష్టమైన ఈ మొక్కలను ప్రతి పంచాయతీలో నాటేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ పనులు వెంటనే జరిగేలా చూడాలని చెప్పారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, "దేశీయ మొక్కలను నాటడం వల్ల పండ్లు, ఫలాలతోపాటు మన నాగరికత పరిఢవిల్లుతుంది. దీనికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. వచ్చే తరాలకు సైతం దేశీ మొక్కల వల్ల ప్రయోజనాన్ని తెలియజేయాలి.

**పంచాయతీలు ఆదాయ మార్గంగా ఉపయోగించుకోవచ్చు**

మొక్కలు పెంపకాన్ని పంచాయతీలు మంచి ఆదాయ మార్గంగా ఎంచుకోవచ్చు. కలప అతి తక్కువ సమయంలోనే లభించే మొక్కలు చాలా ఉన్నాయి. వాటిని బహిరంగ మార్కెట్ ద్వారా విక్రయించడం వల్ల పంచాయతీలు మంచి ఆదాయాన్ని సంపాదించవచ్చు. చాలా దేశాల్లో కలప కొరత ఉంది. పంచాయతీల్లో ప్రత్యేక వనాల ద్వారా ఆదాయాన్ని తెచ్చే మొక్కలను పెంచడం వల్ల మంచి ఫలితాలను సాధించవచ్చు. గ్రామాల్లో కూడా దేశీయ మొక్కలు నాటడాన్ని వాటిని సంరక్షించడాన్ని పిల్లలకు బాధ్యతగా నేర్పించాలి. ఇది వచ్చే తరాలకు చాలా ఉపయోగం" అన్నారు. పవన్ కళ్యాణ్ వెంట అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతి లాల్ దండే, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తదితరులు ఉన్నారు.

## మహానాడును విజయవంతం చేయాలి

**సంక్షోభాలను ఎదుర్కొని సంక్షేమాన్ని అమలు చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకత**
**పెద్దాపురం క్లస్టర్ సమావేశంలో కుడుపూడి సత్తిబాబు**



**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ క్లస్టర్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ మరియు పెద్దాపురం నియోజకవర్గం పార్టీ పరిశీలకులు కుడుపూడి సత్తిబాబు హాజరై ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి మాజీ హోంమంత్రి, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా కుడిపూడి సత్తిబాబు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న ఆర్థిక, సామాజిక సంక్షోభాలను దేశం సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వానికి మద్దతుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇంధన పొదుపులో భాగంగా ఈ సంవత్సరం మహానాడును ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. సంక్షోభాలను సైతం సమర్థవంతంగా ఎదుర్కొంటూ ప్రజలకు సంక్షేమ పాలన అందించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకత అని కొనియాడారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయానికి ప్రతి ఒక్కరూ సంఘీభావం ప్రకటిస్తూ, తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో మొదటిసారి జరగనున్న మహానాడు వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. స్థానికంగా మహానాడు కార్యక్రమంలో పాల్గొనందుకు చేసిన ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట పెద్దాపురం నగర, రూరల్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, క్లస్టర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోండి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో రాజమండ్రి దేవీచౌక్, కంబాలచెరువు హైటెక్ బస్ స్టాండ్, వై-జంక్షన్ రైతుబజార్, ఆర్ట్స్ కళాశాల కూడళ్లలో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి డాక్టర్ జి.మహాలక్ష్మి, సభ్యులు బళ్ళా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో ఇళ్ల సమస్యలు పరిష్కరించాలి : బీజేపీ నాయకులు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట గొల్లపుంత టిడ్కో అపార్ట్మెంట్ సమస్యలు తక్షణం పరిష్కరించాలనీ బిజెపి సీనియర్ నాయకులు కోటిపల్లి వివి సాయి రామ్, బిజెపి టౌన్ అధ్యక్షులు నాళం పణి ప్రకాష్, కోటిపల్లి కృష్ణ, వి దుర్గా ప్రసాద్ లు డిమాండ్ చేశారు. మండపేట పుర పాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో మునిసిపల్ మేనేజరు శ్రీనివాస్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించిన టిడ్కో అపార్ట్‌మెంట్లు, గొల్లపుంత కాలనీ వాసుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. మండపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కేవివి సాయిరామ్ ఆధ్వర్యంలో నాయకులు నాళం పణి ప్రకాష్, వి.దుర్గా ప్రసాద్ తదితరులు మేనేజర్ శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పించారు. గొల్లపుంత రామాలయం నుండి గొడ్డు కాలవ వంతెన వరకు ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిందన్నారు. సుమారు 10 వేల మంది పేదలు నివసిస్తున్న ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలనీ డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లకు సరైన రోడ్డు సౌకర్యం లేదన్నారు. దీనివల్ల దోమలు, అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు. తాగునీరు, విద్యుత్, భద్రత కల్పించాలన్నారు. ఇళ్ల కేటాయింపు పేరుతో మధ్యవర్తులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చిన ఇళ్లలో కనీస వసతులు లేకపోవడం బాధాకరం అని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని సాయిరామ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

**ఉప ముఖ్యమంత్రి పవన్‌ను**

## కలిసిన వేగుళ్ళ లీలాకృష్ణ



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ను హోటల్ షెల్టన్ వద్ద రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ పార్లమెంట్ సభ్యులు ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ బత్తుల బలరామకృష్ణ, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా బలపడాలి

**ఓఎన్జీసీ ద్వారా దివాన్‌చెరువులో కుట్టు మిషన్ల పంపిణీ**



**దివాన్ చెరువు, విశ్వం వాయిస్ న్యూస్ :** సోమవారం సాయంత్రం రాజనగరం నియోజవర్గం దివాన్ చెరువు గ్రామం ఎస్సి కాలనీ లో ఓఎన్జీసీ కంపెనీ ఎస్సి మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ఎన్జీవో ప్రహర్షిత్ అధ్యక్షత వహించగా,ఆల్ ఇండియా ఓఎన్జీసీ ఎస్సి ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఓఎన్జీసీ జనరల్ మేనేజర్ కొమ్ము సత్యనారాయణ, రాజ్ కుమార్ ,రత్నం తదితర ఇతర ఓఎన్జీసీ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఓఎన్జీసీ తన లాభలలో కొంత శాతం బడుగు బలహీన వర్గాల వారు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు, కేటాయిస్తున్నారని, అలాగే గ్రామాల అభివృద్ధికి, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి,వాటి రిపేర్లు ఇలా అనేక కార్యక్రమాలకు, ఓఎన్జీసీ వారు కొన్ని కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారని తెలిపారు.దినిలో భాగంగా దివాన్ చెరువు గ్రామంలో మహిళలకు,వారు ఆర్థిక స్వాలంభన సాధించి తన భర్తకు కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలి,అదే సమయంలో తాను కూడా ప్రతీ విషయానికీ భర్త మీద ఆధారపడకుండా, ఆర్థికంగా బలపడాలని, భావనతో కట్టు మిషన్ల శిక్షణ ఇప్పించి వారికి కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కుట్టు మిషన్లు పొందిన మహిళలు ఈ సందర్భంగా ఓఎన్జీసీ అధికారులకు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివాన్ చెరువు గ్రామ పెద్దలు, ఎంఈఎఫ్ నాయకులు, ఎమ్మెల్సీ నాయకులు, టీడీపీ, జనసేన, వైసీపీ, నాయకులు పాల్గొన్నారు.

**వేదుళ్ళమ్మ తల్లికి రూ.30,116**

## విరాళం అందించిన పెందుర్తి అభిరామ్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం, చిన కొండేపూడి గ్రామంలో శ్రీశ్రీశ్రీ వేదుళ్ళమ్మతల్లి జాతర సందర్భంగా రాజానగరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పెందుర్తి అభిరామ్ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ 30,116/- ల విరాళాన్ని జాతర కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కూటమి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదర్శనగర్ పార్క్‌లో చల్లటి మజ్జిగ పంపిణీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్ వికాస్ పరిషత్ టంగుటూరి ప్రకాశం శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమన్వయ కర్త కొట్టే శ్రీనివాస రావు తన తల్లి దండ్రులు దివంగత కొట్టే వెంకటేశ్వర్లు, వెంకటనరసమ్మ దంపతుల జ్ఞాపకార్థం స్థానిక బాలాజీపేట ఆదర్శ నగర్ పార్క్‌లో చల్లటి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో ఆదర్శనగర్ వాకర్స్ అసోసియేషన్, ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్, బీవీపీ సభ్యులు సుమారు 500 మందికి పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో బీవీపీ టంగుటూరి ప్రకాశం శాఖ అధ్యక్షులు పి. శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి ఎస్. గణేష్ దంపతులు, జిల్లా సమన్వయ కర్త కొట్టే శ్రీనివాస రావు దంపతులు, ఉన్ని కృష్ణ , బీవీపీ సభ్యులు శంకర్రావు, జి.టి.రావు, శివ కుమార్, బి.సి. ఎస్.రావు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కొండలరావు, గణేష్, సభ్యులు పాల్గొన్నారు.

## డిజిటల్ మహానాడుకు నగరం సిద్ధం

**12 కేంద్రాల్లో ఏర్పాట్లు.. - నాయకులు, కార్యకర్తల సమన్వయంపై సమీక్ష**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న "డిజిటల్ మహానాడు-2026" విజయవంతానికి రాజమహేంద్రవరం నగరం సిద్ధమవుతోంది. ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న డిజిటల్ మహానాడుకు సంబంధించి తిలక్ రోడ్డులోని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇన్చార్జ్, పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి హాజరై మహానాడు నిర్వహణకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా పార్టీ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ నిర్వహిస్తున్న డిజిటల్ మహానాడును ప్రతి కార్యకర్తకు చేరువ చేయాలనే లక్ష్యంతో నగరంలోని 12 ప్రాంతాల్లో ప్రత్యేక డిజిటల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ప్రసారం కానున్న మహానాడు కార్యక్రమాలను కార్యకర్తలు, అభిమానులు ప్రత్యక్షంగా వీక్షించేలా భారీ ఎల్ఈడి స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్స్, ఇంటర్నెట్ సదుపాయాలు, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్లస్టర్ వారీగా సమన్వయ బాధ్యతలు అప్పగించారు. అలాగే మహానాడు సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేలా సోషల్ మీడియా ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న ఈ మహానాడు పార్టీ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ "ప్రతి కార్యకర్త ఈ మహానాడును తన ఇంటి కార్యక్రమంగా భావించి విజయవంతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ... "తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రజలకు మరింత చేరువవుతోందన్నారు. ఈ డిజిటల్ మహానాడు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ వర్రే శ్రీనివాసరావు, నాయకులు ఉప్పులూరి జానకీ రామయ్య, బుడ్డిగ రవి, శెట్టి జగదీష్, బంగారు నాగేశ్వరరావు, చొప్పెర్ల భద్రరావు, జవ్వాది మురళి, జవ్వాది విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**టిడిపి తణుకు తెలుగు దేశంపార్టీ**

## పరిశీలకులుగా నక్కా చిట్టిబాబు

**పార్టీ పటిష్టతకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తా : నక్కా చిట్టిబాబు**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ తణుకు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పరిశీలకులుగా రాజమండ్రికి చెందిన టిడిపి సీనియర్ నేత, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నక్కా చిట్టిబాబు నియమితులయ్యారు. ఈయన 1983 పార్టీ స్థాపితం దగ్గర నుండి పార్టీ కార్యకర్తగా, సీనియర్ నాయకునిగా, పార్టీలో వివిధ కీలక పదవులు పొందడంతోపాటు ట్రేడ్ యూనియన్ ఉమ్మడి టిఎన్‌టియుసి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షునిగా, టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిశీలకునిగా నక్కా చిట్టిబాబు చేసిన సేవలను గుర్తించిన పార్టీ అధినాయకత్వం ఆయనను తణుకు నియోజకవర్గ పరిశీలకునిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం నుంచి ఆదివారం ఉత్తర్వులు జారీ చేయబడింది. తనకు ఇటువంటి గొప్ప అవకాశాన్ని కల్పించిన పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర మంత్రి, యువనేత నారా లోకేష్‌కు, రాజమహేంద్రవరం అర్బన్ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చిట్టిబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా తనపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన ఈ పదవి కు మరింత బాధ్యతను పెంచిందని, తాను ఈ పదవికి మరియు పార్టీకి విస్తృత స్థాయిలో సేవలందిస్తానని, నిరంతరం పార్టీ అభ్యున్నతే తన ధ్యేయమని అన్నారు. తణుకు నియోజకవర్గంలో పార్టీని మరింతగా ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.



# రౌడీ జనార్ధనలో స్పెషల్ సాంగ్..

## విజయ్ దేవరకొండతో స్టెప్పులేయనున్న క్రేజీ హీరోయిన్...





ప్రస్తుతం మోస్ట్ అవైటెడ్ సినిమాల్లో రౌడీ జనార్ధన ఒకటి. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో విజయ్ దేవరకొండ, కీర్తి సురేష్ జంటగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల విడుదలైన విజయ్ బర్త్ స్పెషల్ పోస్టర్ విపరీతంగా వైరల్ అయ్యింది. ఇప్పుడు ఈ మూవీ గురించి క్రేజీ న్యూస్ చక్కర్లు కొడుతుందట. టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రౌడీ జనార్ధన'. ప్రొడ్యూసర్ దిల్ రాజు, శిరీష్ సంయుక్తంగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్ కథానాయికగా నటిస్తుంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్ గురించి తాజాగా ఫిలిం నగర్ సర్కిల్స్‌లో ఒక అదిరిపోయే అప్‌డేట్ హల్‌చల్ చేస్తోంది. ఈ సినిమాలో ఒక ప్రత్యేకమైన మాస్ మసాలా స్పెషల్ సాంగ్ ఉండనుందట. అయితే ఈ పాట కోసం కన్నప్ప సినిమా ఫేమ్, యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్ ను చిత్ర యూనిట్ సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ స్పెషల్ పాట కోసం దర్శకుడు రవి కిరణ్ కోలా ఒక అదిరిపోయే మాస్ సిచువేషన్‌ను డిజైన్ చేశారని టాక్.. ఇందులో రౌడీ హీరో విజయ్ దేవరకొండతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకునే గోల్డెన్ ఛాన్స్ ఈ ముద్దుగుమ్మకు వరించినట్లు సమాచారం వినిపిస్తుంది. ప్రస్తుతం ఆమెతో చర్చలు ముగింపు దశకు వచ్చాయని, అంతా అనుకూలిస్తే థియేటర్లలో విజయ్, ప్రీతిల మాస్ డ్యాన్స్ మూవ్స్ , కెమిస్ట్రీ ప్రేక్షకులకు పూనకాలు తెప్పించడం ఖాయమని అంటున్నారు.. ఈ పాటతో పాటు సినిమాలో ఆమె ఒక చిన్న కీలక పాత్రలో కూడా మెరవనుందని జోరుగా ప్రచారం నడుస్తోంది. 'రౌడీ జనార్ధన' కథాంశం పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో పవర్‌ఫుల్ పీరియాడిక్ డ్రామాగా సాగనుంది. ఈ సినిమాలో రాజశేఖర్ క్యారెక్టర్ డిజైన్, ఆయన లుక్ మునుపెన్నడూ చూడని రీతిలో ఎంతో వైవిధ్యంగా, పవర్‌ఫుల్ విలనిజం లేదా నెగటివ్ షేడ్స్‌తో ఉంటుందని ఇండస్ట్రీ టాక్. క్రిస్టో జేవియర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం పాన్-ఇండియా లెవెల్లో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం ఒకవైపు 'రణబాలి' సినిమా చేస్తూనే, మరోవైపు ఈ 'రౌడీ జనార్ధన' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సాలిడ్ కమర్షియల్ సక్సెస్ అందుకోవాలని విజయ్ దేవరకొండ పూర్తి కసితో ఉన్నాడు. ఈ చిత్రంతో ప్రీతి ముకుందన్ మరోసారి తెలుగులో పాపులర్ కానుందని టాక్. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

### ఆ హీరో సినిమాలో ఛాన్స్..

# పెళ్లైందని చెప్పడంతో ఆఫర్ మిస్ అయ్యింది..

సినిమాల్లో కథానాయికగా అవకాశం వెతుక్కుంటూ రావడం అనేది చాలా అరుదు. ఎన్నో సవాళ్లు దాటుకుని.. ఎన్నో అవమానాలు భరించి తమకు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిలదొక్కుకున్న తారలు చాలా తక్కువ. అయితే ప్రస్తుతం బుల్లితెరపై యాంకర్ గా మారిన ఓ అమ్మడు కెరీర్ మొదట్లో హీరోయిన్ ఛాన్స్ మిస్సైందట. గ్లామర్ ఇండస్ట్రీలో పెళ్లి, రిలేషన్‌షిప్స్ అనేవి నటీమణుల కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపుతాయనేదానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ముఖ్యంగా హీరోయిన్లుగా, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా రాణించాలనుకునే వారికి పెళ్లి అనేది ఒక పెద్ద అడ్డంకిగా మారుతుందనే టాక్ ఎప్పటి నుంచో ఉంది. తాజాగా ఇదే విషయంపై పాపులర్ తెలుగు యాంకర్, బిగ్ బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు విషయంలోనూ అదే జరిగింది. పెళ్లైందని ఓపెన్‌గా చెప్పడం వల్లే చేతికి వచ్చిన ఒక మంచి సినిమా అవకాశం చేజారిపోయిందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. స్రవంతి చొక్కారపు బుల్లితెర ప్రేక్షకులకు సుపరిచితమే. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, తన గ్లామరస్ ఫోటోషూట్లతో నెటిజన్లను ఆకట్టుకునే ఈ భామ.. బిగ్ బాస్ నాన్‌స్టాప్ (ఓటీటీ) సీజన్‌లో కంటెస్టెంట్‌గా పాల్గొని మరింత క్రేజ్ సంపాదించుకుంది. అయితే, ఈమెకు పెళ్లై ఒక బాబు కూడా ఉన్నాడనే విషయం చాలా మందికి బిగ్ బాస్ హౌస్‌లోకి వెళ్లేంతవరకు తెలియదు. కెరీర్ ప్రారంభంలోనే ఆమె ప్రశాంత్ అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. సాధారణంగా ఇండస్ట్రీలో అవకాశాల కోసం చాలా మంది తమ వ్యక్తిగత విషయాలను, ముఖ్యంగా పెళ్లిని దాస్తుంటారు. కానీ స్రవంతి మాత్రం అలా దాచకుండా నిజాయితీగా ఉండటమే ఆమెకు మైనస్ అయిందట. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న స్రవంతి, తన కెరీర్ ఆరంభంలో ఎదురైన ఒక అనుభవాన్ని పంచుకుంది. "నేను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఒక పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్స్ ఇచ్చాను. నటన పరంగా, లుక్స్ పరంగా నన్ను అన్ని విధాలా ఓకే చేశారు. ఆ పాత్రకు నేను పర్ఫెక్ట్‌గా సెట్ అవుతానని మేకర్స్ భావించారు. అయితే, ఫైనల్ డిస్కషన్స్ సమయంలో క్యాజువల్‌గా మాట్లాడుతూ.. నాకు పెళ్లైందా అని అడిగారు. నేను ఏమాత్రం దాచకుండా 'అవును, నాకు పెళ్లయింది' అని నిజం చెప్పేశాను. అంతే.. ఆ మాట వినగానే వారి ఎక్స్‌ప్రెషన్స్ పూర్తిగా మారిపోయాయి" అని స్రవంతి చెప్పుకొచ్చింది. ఆ మరుసటి రోజు చెన్నై వెళ్లి షూటింగ్ లో పాల్గొనాలని.. అక్కడకు వచ్చి అడ్వాన్స్ తీసుకోవాలని చెప్పారు. కానీ పెళ్లి అయ్యిందనే విషయాన్ని చెప్పడంతో ఆ మేనేజర్ గంటలో కాల్ చేస్తానని చెప్పారు. ఆ తర్వాత కాల్ రాలేదు. ఆ సినిమా కూడా లేదు. పెళ్లి అయ్యిందనే విషయాన్ని చెప్పి ఆ ఛాన్స్ మిస్ చేసుకున్నాను. ఆ తర్వాత సినిమా కూడా ఆగిపోయిందని తెలిసింది అంటూ చెప్పుకొచ్చింది. స్రవంతి తన కెరీర్‌ను చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా మొదలుపెట్టిన ఆమె, అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' సినిమా ఇంటర్వ్యూతో రాత్రికి రాత్రి బాగా పాపులర్ అయ్యారు. తెలుగు రియాలిటీ షో బిగ్ బాస్ నాన్-స్టాప్ ( మొదటి సీజన్) లో పాల్గొని ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. ప్రస్తుతం ఆమె అనేక సినిమా ఆడియో లాంచ్‌లు, ప్రైవేట్ కార్యక్రమాలు, సెలబ్రిటీ ఇంటర్వ్యూలకు హోస్ట్‌గా వ్యవహరిస్తూ బిజీగా ఉన్నారు.



# ఎవరు గెలిచినా సరికొత్త చరిత్రే..

## అక్కడే ఉంది అసలైన ట్విస్ట్..!



ఈ నాలుగు జట్లలో ఎవరి బలాలు వారికి ఉన్నాయి. బెంగళూరు, గుజరాత్ జట్లు ఫామ్‌లో ఉంటే.. హైదరాబాద్, రాజస్థాన్ జట్లు ఎలాగైనా తమ దశాబ్దాల నిరీక్షణకు తెరదించాలని చూస్తున్నాయి. మరి మంగళవారం నుంచి జరిగే ఈ మహా సంగ్రామంలో ఏ జట్టు నిలిచి, తన కెరీర్‌లో రెండో ఐపీఎల్ ట్రోఫీని సొంతం చేసుకుంటుందో వేచి చూడాలి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ అత్యంత ఉత్కంఠభరితమైన లీగ్ దశను ముగించుకుని అసలైన అసైన్‌మెంట్‌కు సిద్ధమైంది. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ప్లేఆఫ్స్ పోరుకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లు అర్హత సాధించాయి. అయితే ఈసారి ఏ జట్టు కప్పు కొట్టినా ఒక అరుదైన రికార్డు నమోదు కానుంది.

**లీగ్ దశ ముగిసింది.. ఇక పాయింట్ల పట్టికతో పనిలేదు..!**

గత రెండు నెలలుగా సాగిన హోరాహోరీ పోరాటాలకు తెరపడింది. ఇప్పటివరకు ఏ జట్టు ఎన్ని విజయాలు సాధించింది, పాయింట్ల పట్టికలో ఏ స్థానంలో నిలిచింది అనే విషయాలకు ఇక ప్రాధాన్యం లేదు. మంగళవారం నుంచి మొదలయ్యే నాకౌట్ సమరంలో ఆ రోజు ఆటలో ఎవరు అత్యుత్తమ ప్రదర్శన చేస్తారనేదే ముఖ్యం. ముఖ్యంగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లకు ప్రతి మ్యాచ్ జీవన్మరణ సమస్యే. ఒక్క తప్పు దొర్లినా టైటిల్ కల చెదిరి ఇంటిముఖం పట్టాల్సిందే. మరోవైపు మొదటి రెండు స్థానాల్లో ఉన్న బెంగళూరు, గుజరాత్ జట్లు నెట్ రన్‌రేట్ పరంగా బలంగా కనిపిస్తున్నా, ప్లేఆఫ్స్‌లో ఏ జట్టునూ తక్కువ అంచనా వేయలేం.

**ఏ జట్టు గెలిచినా.. ఖాతాలో రెండో కప్పు..!**

ఈ సీజన్ ప్లేఆఫ్స్ రేసులో నిలిచిన జట్లను గమనిస్తే ఒక ఆసక్తికరమైన నిజం గమనంలోకి వస్తుంది. ఈ నాలుగు జట్లలో ఈ ఏడాది ఎవరు విజేతగా నిలిచినా, అది ఆ జట్టుకు రెండో ఐపీఎల్ టైటిల్ కానుంది. ఐపీఎల్ సుదీర్ఘ చరిత్రలో ఈ తరహా సమీకరణం రావడం నిజంగా విశేషం. దీంతో ఈసారి సరికొత్త ఛాంపియన్‌కు అవకాశం లేదు కానీ, రెండోసారి సింహాసనాన్ని అధిష్టించే జట్టు ఏదో తేలిపోనుంది.

**డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బెంగళూరు, తొలి సీజన్ విజేతగా గుజరాత్..**

గతేడాది ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సరికొత్త చరిత్ర సృష్టించింది. సుదీర్ఘమైన 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ తొలిసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. ప్రస్తుత సీజన్‌లోనూ డిఫెండింగ్ ఛాంపియన్‌గా అడుగుపెట్టిన బెంగళూరు అదే జోరును కొనసాగిస్తోంది. ఈసారి కూడా విజేతగా నిలిస్తే వరుసగా రెండో ఏడాది కప్పు గెలవడంతో పాటు, తన ఖాతాలో రెండో టైటిల్‌ను వేసుకుంటుంది. మరోవైపు 2022లో లీగ్‌లోకి అడుగుపెట్టిన తొలి సీజన్‌లోనే గుజరాత్ టైటాన్స్ విజేతగా నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ ఏడాది కూడా కప్పు కొడితే గుజరాత్‌కు కూడా ఇది రెండో టైటిల్ అవుతుంది.

**దశాబ్ద కాలపు నిరీక్షణలో హైదరాబాద్, రాజస్థాన్..**

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు డేవిడ్ వార్నర్ సారథ్యంలో అప్పుడెప్పుడో 2016లో తన మొదటి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకుంది. ఆ తర్వాత పలుమార్లు ప్లేఆఫ్స్‌కు చేరినా ట్రోఫీని మాత్రం అందుకోలేకపోయింది. ఈసారి ఎలాగైనా రెండో కప్పు సాధించాలని పట్టుదలగా ఉంది. ఇక లీగ్ ప్రారంభ సీజన్ అయిన 2008లో దివంగత షేన్ వార్న్ నాయకత్వంలో రాజస్థాన్ రాయల్స్ అద్భుతం చేసింది. తొలి ఐపీఎల్ విజేతగా నిలిచిన రాజస్థాన్, ఆ తర్వాత ఇప్పటివరకు రెండోసారి కప్పును ముద్దాడలేదు. సుమారు 18 ఏళ్లుగా కప్పు కోసం ఎదురుచూస్తున్న ఆ జట్టుకు ఈసారి సువర్ణావకాశం దక్కింది.

### 'వాళ్లంతా తోపులేమో'.. ఒక్క మాటతో ఇచ్చిపడేసిన

# సూర్యకుమార్ యాదవ్..!



సూర్యకుమార్ యాదవ్ తనపై వస్తున్న గాయం పుకార్లను పటాపంచలు చేసినప్పటికీ, అసలైన సవాలు మునుముందు ఉంది. ఫామ్ లేమి, వయసుపై పడటం, మరియు యువ ఆటగాళ్ల నుంచి వస్తున్న పోటీ అతనికి కఠిన పరీక్షగా మారాయి. మైదానంలో తన విలక్షణమైన ఆటతో అభిమానులను అలరించే ఈ 'మిస్టర్ 360' ఆటగాడు, రాబోయే అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో సెలెక్టర్ల నమ్మకాన్ని ఎలా నిలబెట్టుకుంటాడో చూడాలి. ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ ప్రయాణం నిరాశాజనకంగా ముగిసిన వేళ, తన ఫామ్, గాయంపై వస్తున్న పుకార్లకు టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ గట్టి సమాధానమిచ్చాడు. తాను పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నానని స్పష్టం చేస్తూ, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను కొట్టిపారేసినా.. రాబోయే రోజుల్లో భారత జట్టులో అతని స్థానంపై మాత్రం నీలినీడలు కమ్ముకున్నాయి.

**ముంబై ఓటమి.. సూర్య ఫామ్‌లోకి వచ్చినా తప్పని నిరాశ..**

రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 30 పరుగుల తేడాతో ఓడిపోవడంతో ముంబై ఇండియన్స్ ఐపీఎల్ 2026 సీజన్ ముగిసింది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబైకి ఈ సీజన్ అస్సలు కలిసిరాలేదు. దానికి ప్రధాన కారణం స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్ కోల్పోవడమే. ఈ సీజన్‌లో ఆడిన 13 ఇన్నింగ్స్‌ల్లో సూర్య కేవలం 20.77 సగటుతో 270 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అయితే, రాజస్థాన్ రాయల్స్‌పై జరిగిన ఆఖరి మ్యాచ్‌లో 42 బంతుల్లో 60 పరుగులు చేసి ఫామ్‌లోకి రావడం ఒక్కటే ముంబైకి కాస్త ఉపశమనం కలిగించే అంశం.

**గాయం పుకార్లపై సూర్యకుమార్ ఘాటు స్పందన..**

సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్ వైఫల్యాల నేపథ్యంలో, అతడు మణికట్టు గాయంతో బాధపడుతున్నాడని, అందుకే మునుపటిలా షాట్లు ఆడలేకపోతున్నాడనే వార్తలు సామాజిక మాధ్యమాల్లో దావానంలా వ్యాపించాయి. ఈ ప్రచారంపై సూర్య తీవ్రంగా స్పందించాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం అధికారిక బ్రాడ్‌కాస్టర్లతో మాట్లాడుతూ తప్పుడు ప్రచారాలు చేసేవారిపై మండిపడ్డాడు. "నా మణికట్టు గాయం గురించి మాట్లాడుతున్న వారు పెద్ద ఫిజియోలైనా అయి ఉండాలి లేదా వారికి అసలు క్రికెట్ గురించైనా తెలిసి ఉండాలి. నిజంగానే నాకు మణికట్టు సమస్య ఉంటే, నేను మైదానంలోనూ, నెట్స్‌లోనూ ఆడే ఫ్లిక్ షాట్లు అస్సలు ఆడలేను. నా ఆట పూర్తిగా చేతులు, కళ్ల సమన్వయం (హ్యాండ్-ఐ కోఆర్డినేషన్) మీద ఆధారపడి ఉంటుంది. రాజస్థాన్ మ్యాచ్‌లో నేను ఆడిన షాట్లే నేను ఎంత ఫిట్‌గా ఉన్నానో చెప్పడానికి నిదర్శనం" అని సూర్యకుమార్ స్పష్టం చేశాడు.

**టీమిండియా భవిష్యత్తుపై సందిగ్ధత.. శ్రేయస్ అయ్యర్ చేతికి పగ్గాలు?**

సూర్యకుమార్ తన ఫిట్‌నెస్‌పై క్లారిటీ ఇచ్చినప్పటికీ, భారత జట్టులో అతని భవిష్యత్తు మాత్రం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం 35 ఏళ్ల వయసున్న సూర్య, ఫామ్ కోల్పోవడం సెలెక్టర్లను ఆలోచనలో పడేసింది. రాబోయే టీ20 ప్రపంచకప్ సైకిల్ కోసం జట్టును సిద్ధం చేయాలని భావిస్తున్న సెలెక్టర్లు, సూర్య స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు టీ20 జట్టు నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని చూస్తున్నట్లు సమాచారం. ఐపీఎల్‌లో రాణించి తన కెప్టెన్సీ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలనుకున్న సూర్యకు ఈ సీజన్ పెద్ద ఎదురుదెబ్బ అనే చెప్పాలి.

**రాబోయే పర్యటనల్లో సూర్యకు చోటు దక్కేనా?**

ఐపీఎల్ ముగిసిన వెంటనే భారత జట్టు ఐర్లాండ్, ఇంగ్లాండ్ దేశాల్లో పర్యటించనుంది. అక్కడ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లు ఆడనుంది. యువ ఆటగాళ్లను పరీక్షించడానికి సెలెక్టర్లకు ఇది మంచి అవకాశం. ఈ నేపథ్యంలో, సూర్యకుమార్ యాదవ్‌కు 'విశ్రాంతి' అనే నెపంతో జట్టుకు దూరం పెట్టే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒకవేళ ఇదే జరిగితే, సూర్య కెరీర్‌కు ఇబ్బందులు తప్పకపోవచ్చు. ప్రస్తుత కోచ్ గౌతమ్ గంభీర్ గనుక సెలెక్టర్లతో పట్టుబడితే తప్ప, సూర్యకుమార్ యాదవ్ మళ్లీ నీలి రంగు జెర్సీలో కనిపించడం అంత సులువు కాదు.






VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com